


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ప్రకాశం బాపట్ల

బుధవారం 6 ఆగస్టు 2025 పేజీలు 8


- ✦ ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక కీలక వ్యక్తి అజిత్‌రెడ్డి?
- ✦ గత ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు
- ✦ జామాయిల్ కటింగ్ కాంట్రాక్టర్ పేరిట ఎర్రచందనం స్మగ్లింగ్
- ✦ దర్యాప్తులో బహిర్గతమవుతున్న స్మగ్లింగ్ ముఠా అరాచకాలు
- ✦ నాయకుల ముసుగులో స్మగ్లింగ్ కార్యకలాపాలు

# పుష్ప@కరేడు

కందుకూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుతో నాయకుల ముసుగులో కొందరు నాయకులు చేసిన అరాచకాలు విస్మయాన్ని కలుగజేస్తున్నాయి. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు వ్యక్తులు గత ప్రభుత్వంలో పైకి నాయకులుగా నటిస్తూ స్మగ్లర్లుగా మారి నియోజకవర్గంలో విషపు జాడలను వదలడం కందుకూరు నియోజకవర్గం రాజకీయాల్లో సంచలనగా మారింది.

కందుకూరు, మేజర్‌న్యూస్: ఎర్రచందనం స్మగ్లింగ్ కేసు విచారణలో పోలీసులు, రాజకీయ నాయకులు విస్మయం చెందే విషయాలు బహిర్గతం అవుతున్నాయి. స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరించిన కరేడు గ్రామానికి చెందిన వైసిపి నేత అజిత్‌రెడ్డి పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. నెల్లూరు జిల్లా కలిగిరి పోలీసులు ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో అజిత్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. గత నెలలో పది లక్షల విలువైన ఎర్రచందనాన్ని చెన్నైకి అక్రమంగా తరలిస్తుండగా అజిత్‌రెడ్డికి అత్యంత సన్నిహితంగా వున్న వినోద్‌రెడ్డి, మరో ముగ్గురిని అరెస్ట్ చేసిన తిరుపతి జిల్లా వరదాయపాలెం పోలీసులు విచారణలో పలు విషయాలు బహిర్గతమయ్యాయి.



### లోతుగా కొనసాగుతున్న విచారణ

కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనాన్ని ఈ ముఠా అక్రమంగా చెన్నై తరలించి అమ్మినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. స్మగ్లింగ్ వ్యవహారంలో కందుకూరు తోపాటు నెల్లూరు జిల్లాకు చెందిన మరో నలుగురు కీలంగా వ్యవహరించినట్లు ఆధారాలు సేకరించిన పోలీసులు వేట ప్రారంభించారు.

### బ్యాంకు లావాదేవీల్లో గుట్టురట్టు

స్మగ్లింగ్ డబ్బుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను టాస్క్‌ఫోర్స్ బృందాలు గుర్తించాయి. కోట్ల రూపాయలలో లావాదేవీలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడికి అత్యంత సన్నిహితంగా వుంటూ వ్యవహారాలు నడిపిన అజిత్‌రెడ్డి ఫారెస్ట్ భూముల్లో జామాయిల్ కర్ర కటింగ్ కాంట్రాక్టులు పొందినట్లు ప్రచారం ఉంది. మాచర్ల, వినుకొండ, వెంకటగిరి, రాపూరు అటవీ ప్రాంతాల్లో జామాయిల్ కటింగ్ కాంట్రాక్టులు నిర్వహిస్తూ వాటి మాటున అక్రమంగా ఎర్రచందనం చెట్లను పోలీసులు గుర్తించారు అక్రమంగా నరికిన ఎర్రచందనం దుంగలను కరేడు ప్రాంతంలోని మామిడి తోటలు, లంక గ్రామాల్లో దాచిన అజిత్‌రెడ్డి ముఠా డంపు చేశారని స్థానికంగా ప్రచారం ఉంది. కరేడు ప్రాంతంలో భూసేరణ వ్యవహారంలో

మిగతా 8లో

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం

## కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు
## విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు త్రిచక్రవాహనాల పంపిణీ
## రూ.1.66 కోట్లతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రారంభం
## ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, మేజర్‌న్యూస్: అర్హులం దరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులతో పాటు కూటమి నేతలు కూడా బాధ్యత తీసుకోవాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశా రు. కొరిశపాడులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సంద ర్భంగా మండల కేంద్రంలోని దండు రామకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలలోని 56 మంది విద్యార్థిని, విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాలకు విద్యార్థులు ఉత్సాహంగా రావడానికి సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ శాతం లేకుండా విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గం లోని విద్యార్థులందరికీ

మిగతా 8లో




రాష్ట్రంలో మరో నూతన ఒరవడికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజా సమస్యలకు పరిష్కారమార్గం చూపుతున్నారని పేర్కొన్నారు. గతంలో వాట్సప్ ద్వారా కేవలం 500 సేవలు అందుబాటులో ఉంటే కొత్తగా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. 700 సేవలు ఆగస్టు 15 నుంచి అమలు చేయబోతున్నామని, ప్రజలందరూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందిపుచ్చుకోవాలని కోరారు.

# 14 ఏళ్ల నిరీక్షణకు తెర

- మంత్రి స్వామి ఇలాకాలో మళ్లీ ఎగిరిన పసుపు జెండా
- టిడిపి ఖాతాలోకి కొండేపి సర్పంచ్ కుర్చీ
- కొండేపి సర్పంచ్‌గా టిడిపి అభ్యర్థి కొమ్ము సుశీల ఏకగ్రీవం
- ఉప సర్పంచ్‌గా కూనంనేని వాసంతి
- సర్పంచ్‌కి 15 నామినేషన్లు, ఒకటి తిరస్కరణ, 13 మంది విత్ డ్రా
- 14 వార్డుల్లో వైసిపికి-5, 9 మంది టిడిపి అభ్యర్థులు ఏకగ్రీవం



కొండేపి, మేజర్‌న్యూస్: కొండపి పంచాయితీ ఎన్నికల 14 సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. కొండపి పంచా యితీకి సంబందించిన ఉపసంహరణల పక్రియ మంగళవారం ఎన్నికల అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో ముగిసింది. ఈ సందర్భంగా నామి నేషన్ల ఉపసంహరణ పక్రియ ఉదయం నుంచే మొదలై మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. సర్పంచ్‌కు మొత్తం నామినేషన్లు 15 మంది వేయగా పరిశీలనలో ఒకటి తిరస్కరణ కు గురైంది. 14 నామినేషన్లు చెల్లు బాటయ్యాయి. అందులో మంగళ వారం ఉపసంపరణ ప్రక్రియలో 13 మంది నామినేషన్లు ఉపసంహరించు కోవడంతో తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్ధి కొమ్ము సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండపి పంచాయతీకి 14 వార్డుల్లో 39 నామినేషన్లు రాగా అందులో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురైయ్యాయి. మిగిలిన 37 మందిలో 23 మంది నామినేషన్లు ఉపసంహరించారు. మిగిలిన 14 మంది వార్డులుగా ఏకగ్రీవం అయ్యా రు. అందులో టిడిపి బలపరిచిన అభ్యర్థులు తొమ్మిది మంది, వైసీపి బలపరిచిన అయిదుగురు అభ్యర్థులు ఉన్నారు.

### వార్డు మెంబర్లు ఏకగ్రీవ ఎన్నిక

కొండపి పంచాయితీ సర్పంచ్‌కి 14 వార్డులు ఉన్నాయి. వాటిలో 9 మంది టిడిపి బలపరిచిన అభ్యర్థులు

మిగతా 8లో

ఢిల్లీ పార్లమెంట్ కమిటీ హాలులో రియల్ ఎస్టేట్ చట్టం, 2016 అమలు' అనే అంశంపై గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఇతర కమిటీ సభ్యులు



సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగేశన




బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: సీయం సహాయ నిధి ద్వారా రూ. 13,52,443/- విలువ గల చెక్కులు లబ్ధిదారులకు నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పంపిణీ చేశారు. మంగళవారం పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ంలో బాపట్ల నియోజకవర్గం పిట్టలవాని పాలెం మండలంలోని అర్హులైన 22 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది నుండి వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి ద్వారా ప్రజలకు సాయం చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకా రాలను అందిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు అందజేసి కూటమి ప్రభుత్వం వారికి ఆపదలో అండగా నిలుస్తుందని అన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా మద్దతు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని, అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలు సీయం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగలరని తెలియజేశారు.




## 'మనమిత్ర' వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకి, మేజర్‌న్యూస్:ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర వాట్సప్ పౌర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అద్దంకి నియోజకవర్గం తెదేపా సమన్వయ కమిటీ మెంబర్ చుండూరు మురళి సుధాకర్ రావు అన్నారు. పట్టణంలోని 15 వ వార్డులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మన మిత్ర వాట్సప్ పౌర సేవలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరస్తుల బారిన పడకుండా, మహిళలు అరాచక శక్తుల బారిన పడకుండా శక్తి యాప్ ని వినియోగించాలని పట్టణ బిజెపి అధ్యక్షులు కాలేషా వలి పేర్కొన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ని వినియోగించుకోవాలని 16వ వార్డు తెదేపా ఇన్చార్జి యర్రాకుల రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ నంబర్ ద్వారా మీ ఆధార్ కార్డు నంబర్ లింక్ చేసి మీకు కావలసిన అన్ని రకాల పౌర సేవలు పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసాగర్, కట్టమూరు భాస్కరరావు, సచివాలయ సిబ్బంది మౌనిక వీఆర్వో విజయ, శ్రీనివాసరావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.




## 100 రోజులు పనితో జీవనోపాధి

పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పనితో శ్రామికులు జీవనోపాధి మెరుగుపరచుకోవాలన్నారు ఎస్ఆర్పి ఏ. విజయ్ కుమార్.మండలంలోని చందోలు గ్రామ పంచాయతీలో ఎస్ ఎస్ ఏ ఏ టి డైరెక్టర్ జి శ్రీకాంత్ పర్యవేక్షణలో ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ , కమ్యూనికేషన్ సామాజిక తనిఖీ బృందం ఉపాధి శ్రామికులకు ఉపాధి హామీ పథకం యొక్క హక్కులు, రాజీలేని అంశాలు, ఎంపిక చేయబడిన పనులు, సామాజిక తనిఖీ గురించి గ్రామ సభ, వీఆర్ఏ మ్యాప్ ద్వారా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎస్ఆర్పి ఏ.విజయ భాస్కర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకువెళ్లి 100 రోజులు పని కల్పించాలని, జీవనోపాధిని మెరుగుపరచుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయ కుమారి, తెదేపా నాయ కుడు సయ్యద్ నిజాం, షేక్ మీరా, మునీర్, ఏ పీ ఓ, టి ఏ, గ్రామ పెద్దలు, ప్రజలు ఉపాధి శ్రామికులు, ఫీల్డ్ అసిస్టెంట్ మహమ్మద్ సయీద్ , డిఆర్పీలు పాల్గొన్నారు.




## శ్రీకృష్ణ జననం, బాల్యం అద్భుతం

భట్టిప్రోలు,మేజర్ న్యూస్: సమరసత సేవా ఫౌండేషన్ భట్టిప్రోలు మండల సమావేశం సోమవారం జరిగింది.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాపట్ల జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి మాట్లాడుతూ శ్రీకృష్ణ జననం అద్భుతమని పుట్టగానే యమునా నది దారి ఇచ్చిందని విషము పాలు ఇవ్వటానికి వచ్చిన పోతనను రక్తం పీల్చి సంహరించాడన్నారు.ఖాళీయ మర్దనం,కంస సంహారం,నోటిలో పద్నాలుగు లోకాలను చూపించటం, రాతిరోలు లాక్కొని వెళుతూ ఇద్దరు గంధర్వులకు మోక్షం ప్రసాదించాడని,పాలు వెన్న మీగడలను తోటి బాలురు అందరికీ పౌష్టికాహారంగా పంచారన్నారు.ఇలాంటి అద్భుతాలు మానవ మాత్రులకు సాధ్యం కాదని,అందుకే శ్రీకృష్ణుని జననం బాల్యం ఒక అద్భుతమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు జిల్లా ప్రభుత్వ సంబంధాల ప్రముఖ్ బొలగాని వెంకటేశ్వర్లు,ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు,బండారు శ్రీనివాసరావు,బూర్లె అరుణకుమారి పసుపులేటి శ్రీలక్ష్మి,వేల్పూరి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎరువుల కొరత లేదు: వ్యవసాయ అధికారి



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: సదరపు మీటరుకు 33 కుదుళ్ళు ఉన్నట్ల యితే ఆశించిన దిగుబడులు పొందవ చ్చని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలో ఆముదాలపల్లి మరియు నిజాంపట్నంలో పొలంపిలుస్తుంది కార్యక్రమం లో ఏవో పాల్గొని బలగాని వెంకట సుబ్బారావు పొలంలో వేస్తున్న వరి నాట్లును సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఒక హెక్టారుకు వంద కేజీల నత్రజని, 30 కేజీల భాస్వరం, 30 కేజీల పొటాష్ ఆకరి దుక్కిలో భాస్వరం ఇచ్చే ఎరువులు వేయాలి అని సూచించారు. యూరియా పొటాష్‌నుపై పాటుగా వేయాలి అని తెలిపారు. రెండు మీటర్ల కి 20 సెంటీమీటర్లు చొప్పున దారులు తూర్పు ,పడమరలు, తీయటవలన మొక్కకు సూర్య రశ్మీ బాగా తగిలి పురుగు తెగులన్నీ తట్టుకుంటుకుని దుబ్బు బాగా చేస్తుందన్నారు. అర్హత ఉండి అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు సమీప రైతు సేవా కేంద్రాలలో తెలియజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఈఓ జాన్ బి, విఏఏ నాగమణి, ఎంపిఈఓ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

## మన భవిష్యత్తు మన చేతిలో: ఎస్సై బాబురావు



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థుల పాత్ర ఎంతో గణనీయమైందని అడవులదీవి ఎస్సై బత్తుల బాబురావు విద్యార్థులకు సూచించారు. ఈగల్ ఐ జి పి ఆర్కే రవి కృష్ణ ఆదేశాల మేరకు మరియు ఈ గల్ సెల్ బాపట్ల వారి ఆధ్వర్యంలో మంగళ వారం అడవులదీవి జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువతీ యువకులు డ్రగ్స్ అనే విషపు ఊపిరిని తీసుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన అన్నారు. డ్రగ్స్ శరీరానికి హానికరం మాత్రమే కాదు కుటుంబ, సమాజాన్ని, నష్టం కలిగిస్తుం దని ఇవి ఒకేసారి వాడటం మొదలుపెడితే మానడం కష్టమన్నారు. డ్రగ్స్ వాడకంతో వచ్చే సమస్యలలో ముఖ్యమైనవి గుండెకు సంబంధిత మానసిక వ్యాధులపై ప్రభావితం చేస్తాయి. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థిని విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు తల్లిపాలే శారీరక మేధస్సు: ఎంపిపి



అమృతలూరు(భట్టిప్రోలు) మేజర్ న్యూస్: తల్లిపాలు పిల్లలకు శారీరిక మరియు మేదస్సును మెరుగుపరుస్తాయని మండల పరిషత్ అధ్యక్షులు రాపర్ల నరేంద్ర కుమార్ అన్నారు.మంగళవారం యలవరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ ఎ.లక్ష్మీదేవి ఆదేశాల మేరకు సూపర్వైజర్లు నాంచారమ్మ,విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇచ్చినట్లయితే బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుందన్నారు.అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు గృహ సందర్శనకు వెళ్ళినప్పుడు తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను తెలియజే యాలన్నారు. అమర్తలూరు పి.హె చ్.సి వైద్యాధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం సూపర్వైజర్లు నాంచారమ్మ, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ఎంపీపీ నరేంద్ర కుమార్, వైద్యులు వెంకట లక్ష్మి,ప్రదీప్ చేతుల మీదుగా గర్భిణీలకు సీమ ంత కార్యక్రమములను నిర్వహించి అశ్వదిం చారు. కార్యక్రమంలో డిపిఎం బాబురావు, ఎంపీటీసీ ఝాన్సీ, పిహెచ్ ఎన్.కొం డమ్మ, పీహెచ్ ఎస్.శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు ఓంకా రమ్మ,ఎలీషా, హిమ బిందు,ఆశా కార్య కర్తలు ప్రసన్న,అరుణ, అంగ న్వాడీ కార్యకర్తలు కమల కుమారి, సుజాత, సంగీతలక్ష్మి, అమర్తలూరు, మోపర్రు సెక్టార్ల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## యుటిఎఫ్ సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ ముందంజలో ఉంటుందని రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్. బాబయ్య అన్నారు. మంగళవారం మండలంలో రెండవ రోజుగా యుటిఎఫ్ సభ్యత్వ క్యాంపియిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో ఉపాధ్యాయులందరి చేత యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా బాపయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆన్లైన్ వర్క్ తగ్గించాలని యాప్లతో ఉపాధ్యాయుల బోధన సమయం కుంటుపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పిఆర్సి కమిటీ నియమించాలని డిఏ ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలని బాపయ్య కోరారు. పదవ తరగతి పరీక్షలలో గత ఏడాది మండల స్థాయిలో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించిన నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శివన్నారాయణను యుటిఎఫ్ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నిజాంపట్నం మండల అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎం డి. హుస్సేన్, గౌరవ అధ్యక్షులు సిహెచ్. గణేష్ రావు, ఉపాధ్యక్షులు ఓ ,నాగరాజు, కోశాధికారి యు. కుమార్, జిల్లా కౌన్సిలర్ డి .హరిబాబు, పి. ఏడుకొండలు, రాజభూషణం, రామకృష్ణ ,నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.



## అసోసియేషన్ బలోపేతానికి కలసి పనిచేద్దాం: విన్నకోట

బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు రావిపాటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో లో కృష్ణానగర్ డెవలపర్స్ గోపాలం వెంకట రెడ్డియ్య, తోట నవీన్ లను ఆంధ్ర ప్రదేశ్ రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విన్నకోట సురేష్ బాబు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ స్వర్ణ అనిల్ కుమార్, అసోసియేషన్ మెంబర్ జీవీఎల్ మోహన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెన్నకోట మాట్లాడుతూ రాష్ట్ర రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ లో చేరాలని కోరారు. స్టేట్ అసోసియేషన్ విధి విధానాలు రాష్ట్రవ్యాప్తంగా అసోసియేషన్ సభ్యులకు ఏ విధానాలు వర్తిస్తాయో నూతన సభ్యులకు అవే వర్తిస్తుందని తెలిపారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి అసోసియేషన్ కి మద్దతు గా ఉంటామని గోపాలం, తోట హామీ ఇచ్చారు.

# సేవా దృక్పథంతో ముందుకు రావాలి

'పి-4' పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలి

ఈనెల 15 తేదీ నాటికి మార్గదర్శకుల గుర్తింపును పూర్తి చేయాలి

19న పథకం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు దిశా నిర్ధేశం





ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న పీ-4 పథకంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, శాసనసభ్యులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ విషయంలో ప్రతి నియోజకవర్గానికి, ఎమ్మెల్యేకి వారాంతపు రేటింగ్ ఇస్తానని చెప్పారు. ఈ పథకం అమలు ద్వారా సమాజంలో వస్తున్న మార్పును ప్రతి మూడు నెలలకు ఒకసారి మదింపు చేయిస్తానని ప్రకటించారు. తాను కూడా 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక హ్యాండ్ బుక్కును ముద్రించిందన్నారు. మార్గదర్శకులకు ఉన్న అపోహలను తొలగించేలా సమగ్ర వివరాలను ఇందులో పొందుపరిచినట్లు చెప్పారు. సేవా దృక్పథంతో ముందుకు వచ్చేలా మార్గదర్శకులలో ప్రేరణ నింపాలన్నారు. అయితే ఈ విషయంలో ఎలాంటి నిర్బంధం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీ నాటికి మార్గదర్శకులను పూర్తిస్థాయిలో గుర్తించి, 19వ తేదీన ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు తమ నియోజకవర్గాల్లో చేపట్టిన చర్యలను వివరించగా ముఖ్యమంత్రి అభినందించారు. వారు చేసిన సూచనలను ఆయన పరిగణనలోకి తీసుకున్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రత్యేకంగా చర్చించారు. జిల్లాలో మొత్తం 74,911 బంగారు కుటుంబాలను గుర్తించగా, 6350 మార్గదర్శకులను 37389 కుటుంబాలకు అనుసంధానం చేసామన్నారు. మిగతా బంగారు కుటుంబాల కోసం మార్గదర్శకులను త్వరగా గుర్తించాలని చెప్పారు. ఈ సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డిఆర్ఓ బి.చిన ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, కొండపి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, సిపిఓ స్వరూపరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన వెలిగండ్ల సిడిపిఓ



కనిగిరి, మేజర్‌న్యూస్: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వెలిగండ్ల నూతన సిడిపిఓగా బాధ్యతలు స్వీకరించిన షేక్ ఆశా బేగం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నివాస గృహంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రేడ్-1 సూపర్వైజర్‌గా నాయుడుపేట ఐసిడిఎస్ ప్రాజెక్టులో పనిచేస్తూ పదోన్నతి పై రెగ్యులర్ సిడిపిఓగా ఐసిడిఎస్ వెలిగండ్ల ప్రాజెక్టు నందు నియమించడం జరిగింది. అంగన్వాడి కేంద్రాలపై పర్యవేక్షణ ఉండాలని గర్భవతులు బాలింతలు పిల్లలకు పౌష్టికాహారం ఎటువంటి లోపం లేకుండా క్రమముగా అందించాలని పలు అంశాలపై ఎమ్మెల్యే దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం సామ్యూల్ గెర్షోము, డీఈఓ రసూల్, అంగన్వాడి కార్యకర్త ఎం.వరలక్ష్మి, అటెండర్ శాంతి పాల్గొన్నారు.

## కదిరి బాబురావు విద్యాసంస్థల ఉచిత భోజన వసతిగృహం




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న సుమారు 80మందికి పైగా విద్యార్థిని విద్యార్థులకు కదిరి బాబురావు విద్యాసంస్థల ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ఉచిత భోజనం, వసతిగృహం ఏర్పాటు చేయడం పట్ల ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ ఉన్నత విద్యను అభ్యసించడానికి అందుబాటులో జూనియర్ కళాశాల ఏర్పాటుచేసి ఉచితంగా నాణ్యమైన భోజనం అదేవిధంగా వసతులు కల్పించి తమకు ఉన్నతవిద్య అభ్యసించడానికి సహకారం అందిస్తున్న వ్యవసాయ, ఉద్యాన కళాశాల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావుకు విద్యాసంస్థల యజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఇంటర్ విద్యార్థులు ఆనందంతో తెలిపారు.

# ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఉచిత మెగా నేత్ర శిబిరం




ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని మంగమూర్ రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉచిత మెగా నేత్ర శిబిరం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ పై సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమములో అయన మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అనినట్లు మనిషి శరీరంలో అన్ని అవయవాలు కంటే మన కళ్ళు ప్రధానం అయినవి, శరీరములో ఉన్నా అవయవాలు అన్ని ఆరోగ్యముగా ఉంటె సరిపోదు మన కళ్ళు కూడా మరింత ఆరోగ్యంగా ఉండాలి. నేటి రోజుల్లో మారుతున్నా జీవన శైలిని బట్టి చుస్తే ప్రతి పది మందిలో ఎనిమిది మందికి కళ్ళజోడు పెడుతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు మోడరన్ ఐ హాస్పిటల్ చైర్మన్ డా. ఎం వెంకట రమణరెడ్డి విచ్చేసి తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ వారి కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలియచేశారు. డా. అర్పణ షాఫర్ అద్వర్యంలో 600 మందికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న 98 మందిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో డివోఎస్ ఎం. నాగరాజు, పి. నిఖిల, టి. స్వర్ణలత, పిఆర్‌వో సురేంద్ర, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. రాజేంద్ర బాబు, పి. రవి తేజ, పి నీలిమ, ఎస్‌కె నిరుష, వైస్ ప్రిన్సిపాల్ టి రాజశేఖర్ రెడ్డి అధ్యాపకులు ఆర్. జోసెఫ్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ భారాలు రద్దు చేయాలి

### విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శన



చీమకుర్తి, మేజర్‌న్యూస్: మా ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి, విద్యుత్ బారాలు రద్దు చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చీమకుర్తి విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల కార్యదర్శి కే చిన్నపరెడ్డి అధ్యక్షత వహించారు. స్మార్ట్ మీటర్ బిగింపు విద్యుత్ వినియోగదారులందరికీ ప్రమాదకరమైన చర్య దీనికి అయ్యే ఖర్చు అంతా వినియోగదారులపై వేస్తుందని ఉన్న మీటర్ల తొలగించి స్మార్ట్ మీటర్ బిగించాల్సిన అవసరం ఏమి ఉంది అన్నారు. స్మార్ట్ మేటర్ల బిగింపును తక్షణం ఆపాలని, బిగించిన స్మార్ట్ మీటర్ల వెంటనే తొలగించాలని, ట్రూప్ చార్జీలు - సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, కే ఎన్ పి ఎస్ మండల నాయకులు ఏ రాంబాబు,వృత్తిదారుల సంఘం నాయకులు సిహెచ్ కొండయ్య, కెవిపిఎస్ మండల నాయకులు తొట్టింపూడి రామారావు మాట్లాడారు, రైతు సంగం మండల నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, అక్కయ్య, నర్సింగరావు, సిఐటియు నాయకులు శీలం ఆదినారాయణ, ఈ.నాగయ్యశంకర్ పాల్గొన్నారు.

## నకిలీ, తప్పుడు డాక్యుమెంట్స్ కేసులో నలుగురికి రిమాండ్

కనిగిరి, మేజర్‌న్యూస్: కనిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నకిలీ, తప్పుడు పత్రాలు సృష్టించిన కేసులో ఏ 4 దేవాండ్ల నారాయణ , ఏ9 గుంటక నరసింహారెడ్డి,ఏ 12 ఇర్ల పెద్ద తిరుపతయ్య, ఏ 14 జాంద్రపల్లి పౌల్ రాజులు కనిగిరి కోర్టులో మేజిస్ట్రేట్ ముందు లొంగిపోయారు.జడ్జి రూపశ్రీ నలుగురు వ్యక్తులకి రిమాండ్ విధించగా దర్శి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ షేక్ ఖాజావలి మంగళవారం తెలిపారు.కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 301,302 లో మొత్తం 15 మంది కలిసి కుట్రపన్ని అక్రమంగా విలువైన స్థలమును కాజేయాలని ఉద్దేశంతో నకిలీ పత్రాలను సృష్టించి, సుమారు 0.95 సెంట్లు (సుమారు 15 కోట్లు) విలువ గల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించి, తద్వారా ఆ స్థలాన్ని అమ్ముకొని అక్రమ లాభం పొందాలని పన్నాగం పొందారు. ఈ క్రమంలో ఆ స్థలం యజమాని పోలంరెడ్డి మాల కొండారెడ్డి ఇచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంభందించి మరో నలుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సిఐ ఖాజావలి తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయుల దాతృత్వం

దర్శి, మేజర్‌న్యూస్: మండలంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. దర్శి మండల మహిళా ఉపాధ్యాయులు తమ గొప్ప మనసు చాటుకున్నారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ ఏసోబుకి 26 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి తమ వంతు తోడ్పాటు అందించారు. ఈ సందర్భంగా వారు ఏసోబు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారులు రఘురామయ్య రమాదేవి చేతుల మీదగా నగదును ఏసోబుకు అందజేశారు. ఉపాధ్యాయరాళ్లను ఎంఈఓ లు అభినందించారు.

## చిన్నదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'




పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని చిన్నదోర్నాల, చిన్నగుడిపాడు గ్రామాలలో వ్యవసాయశాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని రైతులకు పొగాకు పంటకు ప్రత్యేమ్నాయ పంటలైన కంది, మినుము, అలసంద, మొక్క జొన్న పంటలు సాగు చేయాలనీ తెలిపారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ది పొందని రైతులు రైతు సేవా కేంద్రం నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి నాగరాజు నాయక్, విహెచ్ఎ శిరీష, విఏఏ సూరజ్ బాషా, ఏపీ సిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**ప్రకటన**

నేను పామూరు నుండి ఒంగోలు వెళ్ళే ఆర్టీసీ బస్సులో ప్రయాణించేటప్పుడు నా 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికేట్ పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల దయచేసి 99497 05460 నంబర్‌కు సంప్రదించగలరు.

**ఇట్లు**
**పేరు: బెల్లంకొండ నాగేశ్వరవు**
**తండ్రి పేరు: రమణయ్య**
**పామూరు, ప్రకాశం జిల్లా.**

# డెంగ్యూ నివారణపై దృష్టి సారించండి: మంత్రి అనగాని



రేపల్లె, మేజర్‌న్యూస్: నియోజకవర్గంలో పెరుగుతున్న విష జ్వరాలు, డెంగ్యూ కేసుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. నగరం మండలంలో డెంగ్యూ కేసులు పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరం మండలంలో జ్వరాలతో బాధపడుతున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఫీవర్ సర్వే చేయించాలని అధికారులకు సూచించారు. వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి విధిగా రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక డెంగ్యూ వార్డులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించేందుకు తగిన సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులంతా గ్రామాలలో పారిశుధ్యం పై దృష్టి సారించి మలేరియా, డెంగ్యూ, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో దోమల నివారణకు పాగింగ్ నిర్వహించాలన్నారు. ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి వారికి వైద్య సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలన్న. ప్రజలు తమ నివాస ప్రాంతాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. నీటిని నిల్వచేసే డ్రమ్ములు, ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే జ్వరాల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.



## సూక్ష్మ చిన్న పరిశ్రమల పాత్రపై సూచనలు చేసిన ఎంపి తెన్నేటి

బాపట్ల, మేజర్‌న్యూస్: సూక్ష్మ, చిన్న పారిశ్రామిక వ్యవస్థాపకులు సామాజిక ఆర్థిక శక్తిగా ఉపాధి పెంచుకొని అభివృద్ధిని సాధించే అంశాలను ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ సి 2 పార్లమెంటేరియన్ సెషన్ లో వివరించారు. న్యూఢిల్లీలోని లే మెరీడియన్ హెూటల్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సీ2 పార్లమెంటరీయన్స్ సెక్షన్ లో ఉపాధి, జీవనోపాధి అంశాలపై మాజీ సి 2 అధ్యక్షుడు టీవీఎస్ మొబిలిటీ చైర్మన్ ఆర్ దినేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోక్సభ ప్యానల్ స్పీకర్ బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. చిన్న వ్యాపారులను సామాజిక ఆర్థిక శక్తిగా మల్చడం, సూక్ష్మ పరిశ్రమిక వ్యవస్థాపకులు ఉపాధి పెంపు అభివృద్ధి సాధన, అవకాశాల సృష్టి పై ఎంపీ తేనేటి సూచనలు ఆలోచనలు పంచుకున్నారు. ఈ సమావేశంలో దేశంలోని పారిశ్రామిక వేత్తలు, సహచర ఎంపీలు పాల్గొన్నారు.

# ఏడాదిలో బాపట్లకు రూ.480 కోట్లు మంజూరు




బాపట్ల, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో నియోజకవర్గంలో రూ.480 కోట్ల నిధులు మంజూరయ్యాయని బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం అమలు తీరుపై పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల మరమ్మతలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కు కర్లపాలెం నుండి పెద్దపులి వారి పాలెం వరకు నూతన రోడ్డుకు ప్రతిపాదనలు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో ఆ రోడ్డుకు రూ. మూడు కోట్ల 70 లక్షల తో మంజూరు చేశారని కాంట్రాక్టర్లు టెండర్లు వేసి ముందుకు రాకపోవడంతో రద్దుచేసి తిరిగి నూతన ఎస్సార్ తో రూ.5 కోట్ల 10 లక్షలతో ఆమోదం పొందటం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేషేకి వెళ్లి వారు లేనందున ఓ ఎస్ డి ని కలసి 10 ప్రతిపాదనను అందించినట్లు తెలిపారు. అందులో ముఖ్యంగా పాండురంగాపురం సూర్యలంక రోడ్డుకు ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ప్రహరీ గోడ వెంబడి ఉన్న అటవీ శాఖ భూమి పరిధిలో మార్గాన్ని ఏర్పాటు చేయాలని, ప్యార్లీ డ్రైన్ లో బోటు షికారు వసతుల ఏర్పాటుకు 25 ఎకరాలు భూమిని కేటాయించాలని కోరినట్లు తెలిపారు. నేడు జరగనున్న క్యాబినెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం కు మరల ప్రతిపాదనలు ఇచ్చి క్లుప్తంగా వివరిస్తానన్నారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా 100 పడకల నుండి 300 పడకల పెంపుకో వైద్య ఆరోగ్యశాఖ అధికారి సత్య కుమార్ యాదవ్ ను కలసి ప్రతిపాదన అందించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.480 కోట్లు అన్ని శాఖల మంత్రులను కలసి ప్రతిపాదనలు కలెక్టర్ తో కలిసి సంయుక్తంగా అందించినట్లు తెలిపారు.



## సెయింట్ ఆన్స్‌లో క్రికెట్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ జెర్సీ, లోగో లాంచ్

వేటపాలెం, మేజర్‌న్యూస్: క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు ఫ్రాంచైజీ యాజమాన్యం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాలలో వారి జట్టు జెర్సీ, లోగోలను మంగళవారం లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెయింట్ ఆన్స్ కళాశాల ఫౌండర్ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8 నుండి విశాఖపట్నంలో జరిగే ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో ఏడు జట్లు పాల్గొంటాయన్నారు. జరగబోయే ఈ పోటీలలో క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జట్టు కెప్టెన్ హనుమ విహారి కార్యక్రమంలో పలువురు విద్యార్థులతో సంభాషిస్తూ, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలిపారు. గతంలో జట్టు ఫైనల్ వరకు చేరిందని ఈసారి విజయం తమదేనన్నారు. కళాశాల విద్యార్థుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం ఎంతో ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో జట్టు కోచ్ అబ్రహం, టీమ్ మేనేజర్ హర్ష, సీఈవో యశ్వంత్, క్రికెట్ అసోసియేషన్ మెంబర్ బి.శ్రీనివాసరావు, సెయింట్ ఆన్స్ కళాశాల సెక్రటరీ వనవా రామకృష్ణారావు కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, మేనేజర్ ఆర్‌వి రమణ మూర్తి, ప్రిన్సిపల్ కె.జగదీష్ బాబు, డైరెక్టర్ డాక్టర్ సి.సుబ్బారావు, తదితర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ ప్రమాణాలు పాటించండి

### ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ప్రభుత్వ ప్రమాణాలు పాటించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునే వారికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. స్థానిక తెదేపా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజును రాష్ట్ర రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి దుశ్యాలవతో సన్మానించి పూల మొక్కను అందించి అసోసియేషన్ డైరీ ను అందించారు. ఎమ్మెల్యే కు అసోసియేషన్ విధివిధానాలను, సమస్యలను రాష్ట్ర అధ్యక్షుడు విన్నకోట సురేష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ కొను గోలుదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునే వారికి నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అసోసియేషన్ కు అండగా ఉంటానని ఆమె ఇచ్చారు. రాష్ట్ర రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ స్వర్ణ అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు రావిపాటి విష్ణువర్ధన్, సభ్యుడు జి వి ఎల్ మోహన్ గౌడ్, ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బుర్లవారిపాలెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: దశాబ్దాలగా కుంటుపడిన అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. చీరాల మండలం బుర్లవారిపాలెం గ్రామంలో కోటి రూపాయల తో నిర్మిస్తున్న ఆర్ అండ్ బి రోడ్డు పనులను మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం పరుగులు పెడుతుందన్నారు. ఏడాదిలో చీరాల నియోజకవర్గం ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. చీరాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ జనార్ధన్, గ్రామ పార్టీ అధ్యక్షులు బుర్ల రాంబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులు నిర్వహించాలి: కలెక్టర్



నగరం, మేజర్‌న్యూస్: ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా యుద్ధప్రాతిపదికపై వైద్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని, ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఈదుపల్లిలోని ప్రతి ఇంటింటికీ వెళ్ళి పరిసరాలను పరిశీలించారు. వైరల్ ఫీవర్ నిర్లక్ష్యం కారణంగా ఈదుపల్లిలో ఒకే కుటుంబంలో భార్యాభర్త లిరువురు మృతి చెందారన్నారు. మృతుడు తుమ్మల సుబ్బారావుది డెంగ్యూ జ్వరం కాదని, అతని భార్య మహాలక్ష్మికి డెంగ్యూ లక్షణాలు కన్పిస్తున్నా యన్నారు. కేవలం ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగా వీరు మృతి చెందారన్నారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి తప్ప వైద్యం చేయరాదని, అలాంటి వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని, గ్రామంలో 56 మందికి జ్వరాలుండగా, ప్రస్తుతం 6 కేసులు ల్యాబ్‌కు పంపగా పాజిటివ్ వచ్చిందన్నారు. విష జ్వరాలతో బాధపడే వారు ప్రభుత్వ వైద్యశాలలో మాత్రమే వైద్యం చేయించుకో వాలన్నారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ తప్పక పాటించాలన్నారు. విష జ్వరంతో ఒకే కుటుంబంలో భార్యాభర్తలు మృతి శీర్షికన మంగళవారం వెలువడిన వార్త పాఠకులకు విదితమే. గ్రామస్తులు మంచినీటి సమస్య ఉందని కలెక్టర్ వెంకటమురళి దృష్టికి తీసుకురాగా 15-20 రోజుల్లోపు మంచినీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంకటమురళి వెంట ఆర్‌డీఓ రామలక్ష్మి, డిఎంహెచ్ఓ విజయమ్మ, డిఎల్‌డిఓ పద్మ, డిప్యూటీ సీఈఓ కృష్ణ, తహశీల్దారు నాంచారయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యులు, పంచాయితీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తనిఖీ చేశారు. అన్నా క్యాం టీన్‌లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడి భోజనం నాణ్యత, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరలో రైతు బజార్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుంటామని అన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమీషనర్ పిల్లి కృష్ణమోహన్ రెడ్డి, టీడీపి నాయకులు గాయం తిరుపతిరెడ్డి, కోటా సురేష్ తదితరులు ఉన్నారు.

## వాట్సప్ గవర్నర్స్ విజయవంతం

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర పాలనను ప్రజలకు మరింత చెరువ చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వాట్సాప్ గవర్నర్స్ కార్యక్రమం చేపట్టినట్టు ఆ గ్రామ టిడిపి నాయకుడు మక్కిన శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పాలేటిపాడు గ్రామంలో వాట్సాప్ గవర్నర్స్ కార్యక్రమం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పథకాలు టిడిపి అధికారం వచ్చిన తరువాత చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ విధంగా చేరవేరాలో ఈ అవగాహన కార్యక్రమం ద్వారా తెలియ పరచినట్టు ఆ గ్రామ టిడిపి నాయకుడు మక్కిన శ్రీనివాసరావు తెలిపారు.

# ఎరువుల కొరత రాకుండా చూడాలి

## వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం అమరావతి, సచివాలయం నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్రంలో ఎరువుల నిల్వలు, వినియోగంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల వ్యవసాయ అధికారులు, మార్క్ఫెడ్, జిల్లా సహకార శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు సకాలంలో ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలను సమీక్షించుకుంటూ పంటల సరళిని బట్టి ముందుగ ఇండెంట్ పెట్టాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మార్క్ఫెడ్, సహకారశాఖ అధికారులతో సమావేశమై జిల్లాలో ఎరువుల లభ్యత, నిల్వలు, పంపిణీపై సమీక్షించి రైతులకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్‌తో జిల్లాలో 54,468 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఈ సంవత్సరం ఏప్రిల్ 1 నాటికి 27,111 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా ఈ నెల 5వ తేదీ నాటికి జిల్లాకు 27,861 మెట్రిక్ టన్నులు జిల్లాకు రావడం జరిగిందని, ఇప్పటివరకు రైతులు 24,471 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగించగా ఈ నెల 5వ తేదీ నాటికి జిల్లాలో 30,501 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్‌కు వివరించారు.



## వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

కనిగిరి, మేజర్‌న్యూస్: మండలంలోని చాకిరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మంగళవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారాములు, ఆంజనేయ స్వామి వారి విగ్రహాలును గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గణపతి పూజ, రుద్రస్వాహాకార, ఆదిత్యాది నవగ్రహ అవివాహిత హెూమంలను, యంత్రంములకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మంగళ హారతులను వేదపండితులు రావినూతల రమేష్ శర్మ బ్రహ్మంత్వమున వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ నిర్వాహకులు కుందురు తిరుపతిరెడ్డి,ఎంపీపి దంతులూరి ప్రకాశం,భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# పేద ప్రజల సంతోషమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



-వైసీపీ ప్రభుత్వంలో రూ.10,500గా ఉన్న సాగర్ కనెక్షన్ డిపాజిట్
-ఎమ్మెల్యే చొరవతో రూ.6500కు తగ్గిన డిపాజిట్
-విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేసిన గునుపూడి, టిడిపి నాయకులు

పొదిలి, మేజర్‌న్యూస్: పేద ప్రజల సంతోషమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక దర్శి రోడ్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీలో భూగర్భ జలాలు అడుగంటి, త్రాగడానికి గుక్కెడు నీరు లేక పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు తల్లడిల్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగర్ కనెక్షన్ డిపాజిట్ రూ.10500 ఉండడంతో పేదలు అంత మొత్తంలో డిపాజిట్ చెల్లించుకోలేక నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాన్ని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నగర పంచాయతీ కమిషనర్ కే ఎల్ నారాయణ రెడ్డితో మాట్లాడి డిపాజిట్‌ను రూ.6500కు తగ్గించడం జరిగిందన్నారు. ప్రజలు నీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళగానే తక్షణమే స్పందించి సాగర్ కనెక్షన్ డిపాజిట్ తగ్గించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డికి నగర పంచాయతీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి ఎలమంద, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్, మండల కన్వీనర్ మీగడ ఓబులరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, మాజీ ఎంపీటీసీ గునుపూడి మాధవి, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలాని భాష,యువ నాయకుడు అంజిరెడ్డి, మహిళా నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, అప్పల సత్యం, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున, స్వామి రాజా, సరైనోడు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి: ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో జరుగుతున్న ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు. మునిసిపల్ కమీషనర్ పి కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. డ్రైనేజ్ కాలువల శుభ్రపరచడం, చెట్లు తొలగించడం, చెత్త నివారణ వంటి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.వార్డులు మరింత శుభ్రంగా, ఆరోగ్యకర వాతావరణంతో ఉండేలా నిరంతర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ పిల్లి కృష్ణమోహన్ రెడ్డి, పట్టణ టిడిపి యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి చెక్కును అందజేసిన ఎస్పీ దామోదర్




ఒంగోలు, మేజర్‌న్యూస్: విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలకు పోలీసు శాఖ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ప్రకాశం జిల్లా దొనకొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ యస్.బాల ఉగ్ర 02.02.2025న చిలకలూరిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి కానిస్టేబుల్ కుటుంబానికి కందుకూరులోని స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజి (అక్సిడెంటల్ డెత్ బెనిఫిట్స్) ద్వారా మంజూరైన రూ.కోటి రూపాయలు చెక్కును ఉగ్ర సతీమణి మంజులాదేవికి మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని కోల్పోవడం పోలీస్ శాఖకు తీరనిలోటుని పేర్కొన్నారు. కుటుంబానికి అందవలసిన అన్ని బెనిఫిట్లు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిపివో ఏవో రామ్మోహన్ రావు, ఆర్ఐ సీతారామి రెడ్డి, కందుకూరు ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ వి.అప్పలరాజు తరుపున చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాస్ కృష్ణ, డిప్యూటీ మేనేజర్ బి.యన్.బి.చారీ, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: అధికారుల కన్నుగప్పి అర్ధరాత్రి చాటుమాటుగా 321 గోతాల రేషన్ బియ్యాన్ని త్రిపురాంతకం మండలం అనంతపూర్ అమరావతి హైవే రహదారిలోని మేడపి టోల్గేట్‌ప్లాజా వద్ద విజిలెన్స్ అధికా రులు దాడి చేసి మూడు వాహనాలనుపట్టుకున్నారు. పేద వాడికి కడుపునిండా పిడికెడు మెతుకులు తినేందుకు ప్రభుత్వం కిలో బియ్యం రూపాయికి ఇస్తుండగా అదే బియ్యాన్ని కొందరు వ్యాపారస్తులు అధికార పార్టీ నాయకుల అండతో మార్కాపురం దొనకొండ మండలాల నుండి మూడు మినీ లారీలలో 321 గోతాల్లో బియ్యాన్ని తరలిస్తుండగా అదే వ్యాపారం చేస్తున్న కొందరు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందివ్వడంతో హుటాహుటిన వచ్చి టోల్గేట్ ప్లాజా వద్ద బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీ చేసి త్రిపురాంతకం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు ఈ దాడులను విజిలెన్స్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ రాఘవేంద్రరావులు ఎర్రగొండ పాలెం ఎన్‌ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహసిల్దార్ చంద్ర శేఖర్‌రావు, సిబ్బంది కలిసి ఈ దాడులు నిర్వహించారు. 225 గన్ని బ్యాగ్స్. 96 ప్లాస్టిక్ బ్యాగ్స్ మొత్తం 321గోతాల బియ్యాన్ని ప్రభుత్వ గోడవునకు తరలించారు. అక్రమంగా రవాణా చేసిన మూడు వాహనాలను సంబంధించిన వ్యక్తులపై క్రిమినల్ కేసు, సిక్స్ ఏ కేస్ నమోదు చేసి నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఈ వ్యాపారం అక్రమంగా చేసుకునే వారికి మూడు పూవులు ఆరు కాయలుగా జరిగిపోతున్న జిల్లా మొత్తంలో సంపాదన మార్గానికి రేషన్‌బియ్యం ప్రధానంగా ఆదాయ వనరుగా మారింది. ప్రతి మూడు మాసాలకు ఓసారి విజిలెన్స్ అధికారులు అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని ఆ వ్యాపారులపై 6ఏ కేసు చేసినప్పటికీ ఈ వ్యాపారం కొనసాగుతున్న ఏ నాయకుడు ఈ అక్రమ వ్యాపారులపై దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు దీంతో ఇదే అదునుగా భావించిన రేషన్ బియ్యం అక్రమంగా తరలించి అధిక ధరలకు అమ్ముకొని డబ్బు సంపాదనే ముఖ్యంగా అనుకునే వారికి ఎర్రగొండపాలెం త్రిపురాంతకం మండలాలు ఈ వ్యాపారానికి అనుకూలంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ బియ్యం సరఫరాలో అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ఈ విషయంలో ప్రభుత్వం అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేసి చూడాల్సిందే మరి.

సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల

## 9 మంది హోంగార్డులకు కానిస్టేబుల్ ఉద్యోగాలు

### అభినందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్స్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నిర్వహించిన కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో 9 మంది ఉద్యోగాలు సాధించారు. సివిల్, ఒకరికి ఏపీఎస్పీ విభాగాలలో కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించగా వారందరిని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ద్వారా ఈ విజయాన్ని సాధించగలిగారని ,హోంగార్డ్స్ నుండి కానిస్టేబుల్ స్థాయి సాధించడం తమ తోటి వారికి స్ఫూర్తిదాయకమన్నారు. ఉద్యోగాలు సాధించిన 9 మంది అభ్యర్థులు, తమకు కానిస్టేబుల్ ఉద్యోగాలు రావడంలో సహాయపడిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, ఆర్ఐ సీతారామి రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: అల్లూరు గ్రామంలో ఆత్మ,ఒంగోలు వారి సౌజన్యంతో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. మంగళవారం వ్యవసాయ అధికారి కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేయు వివిధ రకాలలో వరి పంటను అత్యధికంగా అల్లూరు గ్రామంలో సాగు చేస్తారని వారి కోసమే ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. దర్శి నుండి ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రధాన శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ ఈ గ్రామంలో సాగు చేసే అనువైన వరి రకాల గురించి వివరించారు.ముఖ్యంగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులైన విత్తనశుద్ధి, కలుపు యాజమాన్యం గూర్చి వివరించారు. అలాగే వరిలో సమగ్ర ఎరువుల వాడకం, పురుగు, తెగుళ్ల నివారణ కోసం చేపట్టాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్, ఆత్మ కృష్ణ, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు దివ్య ఔషధం



దర్శి, మేజర్‌న్యూస్: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా దరశి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్ నందుగల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర నందు, దరిశి మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కార్య కర్తలకు, నర్సులకు స్థానిక ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ బాధం.లక్ష్మీప్రసన్న, చిన్నపిల్లల డాక్టర్ బి.సాయికుమార్ రెడ్డి లతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా డాక్టర్ బాధం లక్ష్మీప్రసన్న, డాక్టర్ బి.సాయిమణిధర్ రెడ్డి పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను తెలియచేశారు. తల్లికి జ్వరమొచ్చినా,తల్లి ఎయిడ్స్ రోగైనప్పటికీ, చంటిబిడ్డకు ఎలాంటి అపోహలకు తావులేకుండా నిరభ్యంతరం గా పాలు ఇవ్వడం మరచిపోవద్దని పిల్లల డాక్టర్ సాయికుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాదు,సంస్థ నూతన అధ్యక్షులు చీదెళ్ల బసవయ్య, సంస్థ సలహాదారుడు ఎన్ఎస్పీహెచ్ సుబ్బారావులు సదస్సునుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లను మానవత సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌వి సుహాసని, సుశీలమ్మ, వైద్య ఆరోగ్యశాఖా సిబ్బంది పాల్గొన్నారు.





# వెట్టిచాకిరి కార్మికులకు విముక్తి

### 40 మందికి రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేసిన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్: టంగుటూరు మండలంలోని రెండు రొయ్యల పరిశ్రమలలో వెట్టి చాకిరీ చేస్తున్న 40మంది ఒడిశా, చత్తీస్ గఢ్ రాష్ట్రవాసులకు ప్రకాశం జిల్లా అధికారులు విముక్తి కల్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వారికి రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. పనిచేసిన కాలానికి చట్ట ప్రకారం వారికి రావాల్సిన నగదును ఇప్పించడంతోపాటు ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించి బాధితులను వారి స్వస్థలాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. వీటికి సంబంధించిన వివరాలను ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. ఒడిశా నుంచి 17 మంది, చత్తీస్గఢ్ నుంచి 27మంది వచ్చి టంగుటూరు మండలంలోని రెండురొయ్యల పరిశ్రమలలో పనిచేస్తున్నట్లు చెప్పారు. తమ జిల్లా ప్రజలు ఇక్కడ వెట్టి చాకిరీ చేస్తున్నారని ఛత్తీస్ గఢ్‌లోని బస్తర్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన సమాచారం మేరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ అధికారులు ఈ బాధితులను సోమవారం రక్షించి నట్లు తెలిపారు. ఒక మధ్యవర్తి మాయమాటలు చెప్పి తమను ఈ వెట్టి చాకిరీ ఊబిలోకి దించారని, తమకు సరైన వసతిగానీ, ఆహారంగానీ, చేసిన పనికి డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని బాధితులు చెప్పినట్లు ఆర్డీఓ వివరించారు. బాధితులలో మైనర్లు కూడా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో సదరు పరిశ్రమలపై వెట్టి చాకిరీ నిర్మూలన, బాల కార్మిక నిర్మూలన, కనీస వేతన చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి బస్తర్ జిల్లా నుంచి వచ్చిన అధికారులతో వారి స్వస్థలాలకు పంపుతున్నట్లు తెలిపారు. రిలీఫ్ సర్టిఫికెట్లు అందజేసిన కార్యక్రమంలో ఆర్డీవోతో పాటు ఐసిడిఎస్ పిడి. సువర్ణ, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎం.కోటేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మేరీ సుజాత, టంగుటూరు తహసిల్దార్ ఆంజనేయులు, డిసిపిఓ దినేష్ కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సునీల్ కుమార్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

### – మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య

ఒంగోలు, మేజర్‌న్యూస్ : నగరంలోని అంజయ్య రోడ్డులో ఎస్సీ హాస్టల్-2 వార్డెన్ అవినీతిపై విచారణ జరిగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిల్లా చెన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. హాస్టల్లో ఉంటున్న దళిత విద్యార్థులకు సరిగా భోజనం పెట్టడం లేదు. హాస్టల్లో సరుకులు అన్నీ రాత్రివేళ నల్ల బజారుకు ప్రైవేటు వ్యక్తి ద్వారా తరలిస్తున్నారు. ఈ విషయమై అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు ఆ విధంగా నల్లబజారుకు తరలిస్తున్న సరుకులను ప్రైవేటు వ్యక్తి ద్వారా బయటకు పంపే సమయంలో వీడియో కూడా తీయడం జరిగింది. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేదన్నారు. విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టకుండా సరుకులను నల్లబజారుకు తరలిస్తున్న వార్డెన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి దళిత విద్యార్థులకు న్యాయం చేస్తామని బిల్లా పేర్కొన్నారు. వార్డెన్ ని సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసు పెట్టి అరెస్ట్ చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## 7న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రమేష్ ఒంగోలు పర్యటనను విజయవంతం చేయాలి

### అసెంబ్లీ ఇన్‌ఛార్జి యోగయ్యయాదవ్ క్యాడర్‌కు పిలుపు



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: ఈనెల 7వ తేదీన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని ఈ నెల 7 వ తేదీన ఒంగోలులో జరుగు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ సభను ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ యోగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపట్నం మండల అధ్యక్షులు ఎల్లమంద అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జి వై.సి యోగయ్య యాదవ్, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు శివారెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆషారావు, సుబ్బారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జి యోగయ్య యాదవ్ మాట్లాడుతూ బిజెపి కుటుంబము నుండి క్రమశిక్షణ కలిగి అంచలంచెలుగా ఎదుగుతూ ఈరోజు రాష్ట్ర అధ్యక్షునిగా హోదాలో ఒంగోలు వస్తున్న రాష్ట్ర నూతన అధ్యక్షులు యోగయ్య యాదవ్‌కు సాదర స్వాగతం పలకాలని సూచించారు. 7న జరిగే సభకు కొత్తపట్నం మండల కేంద్రం నుండి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య, రాముడు, జాలయ్య, అనిల్ పాల్గొన్నారు.

## బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కరం

### జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యారావు



ఒంగోలు, మేజర్‌న్యూస్: నిర్ణీత కాలం వరకు బిడ్డలకు తల్లి పాలు ఇవ్వడం ద్వారా వారికి మంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఇచ్చిన వారం అవుతాయని, అంతే కాకుండా రొమ్ము క్యాన్సర్ బారిన వారు పడకుండా కపడవచ్చు అని జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. మాణిక్యరావు పిలుపునిచ్చారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా జిజిహెచ్ గైనకాలజీ విభాగంలో తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దాదాపు 50మంది తల్లులకు తల్లి పాల అవశ్యకత, ప్రాముఖ్యత ను తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. అశోక్ కుమార్, గైనిక్ హెచ్‌వోడి సంధ్యా రాణి, పెడియాట్రిక్స్ హెచ్‌వోడి డా.తిరుపతిరెడ్డి,సిఎస్ఆర్ఎంవో డా.మాధవిలత, డాక్టర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలసిన బిజెపి నాయకులు

గిద్దలూరు, మేజర్‌న్యూస్:పట్టణ బీజేపీ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన రమణ బాబును మర్యాద పూర్వకంగా శాలువా తో సన్మానించడం జరిగింది. పట్టణ ప్రజల సమస్యలకు స్పందించి వెంటనే పరిష్కారము చూపడం లో ముందు ఉండాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు భవనాసి వెంకట రామాంజనేయులు, మాజీ మైనార్టీ మోర్చ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మునగనూరి రామకృష్ణ, భూపని సంతోష్ కుమార్, మాజీ ఎస్‌సి మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టేమల్ల పుల్లయ్య, సీనియర్ నాయకులు కె.చంద్ర మోహన్ పాల్గొనడం జరిగింది.



# పేదరిక నిర్మూలనకు పి4 ఒక ప్రతిష్టాత్మక చొరవ: సీఎం చంద్రబాబు

సూర్య ప్రతినిధి బాపట్ల




సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడానికే పి 4 విధానాన్ని ప్రవేశపెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. పి 4 అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. నిరుపేదల కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో పేదరికాన్ని పూర్తిగా శూన్యం చేయడం లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రభుత్వ విధానాలన్నీ పేదరిక నిర్మాలన కోసమేనన్నారు. బంగారు కుటుంబాలను ఐదు కేటగిరీలుగా విభజించి దశలవారీగా ప్రక్రియ చేపడతామన్నారు. బంగారు కుటుంబాలకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇందు కొరకు సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం అనే పోర్టల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులైన వారికి ఎలాంటి శిక్షణ కావాలో స్వయంగా నైపుణ్య శిక్షణలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. తద్వారా ఉద్యోగ మేళ నిర్వహిస్తామన్నారు. ఏ ఉద్యోగానికి ఎలాంటి అవసరమో గుర్తించి శిక్షణ ఇస్తామన్నారు. పెట్టుబడులు తెస్తున్నాం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అమరావతి, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, అనంతపురం ప్రాంతాలలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విషయాలపై విస్తృతమైన ప్రచారం చేయాల న్నారు. సకాలంలో సహాయం అందించడంలో మార్గదర్శిలకు సూచనలు ఇవ్వాలన్నారు ఎవరిని బలవంతం చేయరాదని ఆదేశించారు. సమిష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఆయన పలు సూచనలు చేశారు. ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, సిపిఓ షాలేమ్ రాజు, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాసరావు, ఆర్ డి ఓ గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా మంత్రి టిజి భరత్ జన్మదిన వేడుకలు

పామూరు, మేజర్‌న్యూస్: టీడీపీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కనిగిరి నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పందిటి హరీష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. మంత్రి టిజి భరత్ పరిశ్రమల అభివృద్ధిలో కృషి చేస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు హరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సయ్యద్ అమీర్ బాబు, ఉప్పలపాటి హరిబాబు, గుంటుపల్లి శ్రీనివాసులు, మెడబలిమి వెంకట్రావు, తడికమల్ల సుబ్బారావు, నొస్సం నాగేంద్ర చారి, షేక్ ఖాజా రంతుల్లా, బత్తుల సత్యం, చలపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సింగిల్ విండో డైరెక్టర్‌ను అభినందించిన గన్నవరం గ్రామస్తులు

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేసిన వెలిగండ్ల మండల గన్నవరం పంచాయతీ టిడిపి నాయకులు జుటికే కొండయ్య (డీలర్), జుటికే దానియేలు, మల్లెల యేసేబు( గ్రామ పెద్ద) గోన ప్రకాశం జాళ్లపాలెం గ్రామ పెద్ద తదితరులు పాల్గొని వెలిగండ్ల మండల సింగల్ విండో డైరెక్టర్‌గా యద్దనపూడి సలోమాన్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువతో సన్మానించడం జరిగింది.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



టంగుటూరు, మేజర్‌న్యూస్: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో మంగళవారం మంత్రి డాక్టర్ స్వామి క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలు తమ సమస్యల మీద పలు వినతులను మంత్రి డాక్టర్ స్వామికి అందజేసి తమ సమస్యలకు పరిష్కారం చూపించి న్యాయం చేయాలని మంత్రి డాక్టర్ స్వామిని విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం డాక్టర్ స్వామి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారికి తగ్గా న్యాయం చేస్తుందని తెలిపారు. ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నదే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, అర్జీదారులు పాల్గొన్నారు.



## రాష్ట్ర అధ్యక్షుల పర్యటన విజయవంతం చేయాలి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ప్రకాశం జిల్లా పర్యటనకు ఈ నెల 7వ తేదీన వస్తున్న సంధర్భంగా జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసులు, జిల్లా జనరల్ సెక్రటరీ డాక్టర్ జెవి నారాయణ పిలుపు మేరకు గిద్దలూరు అసెంబ్లీ పరిధిలో అన్ని మండలాల అధ్యక్షులు వివిధ హెూదాలలో ఉన్న బీజేపీ నాయకులు కార్యకర్తలు ఒంగోలులో జరిగే ర్యాలీలో పాల్గొని తదనంతరము రాష్ట్ర అధ్యక్షులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను. అంతే కాకుండా అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని గిద్దలూరు అసెంబ్లీలో భారతీయ జనతా పార్టీ బలంగా ఉంది అని నిరూపించడానికి ప్రతి బీజేపీ నాయకుడు ఈ కార్య క్రమం విజయవంతానికి కృషి చేయాలని కోరుకుంటున్నాను.

## మద్యం మత్తులో ఓ ట్రాక్టర్ భీభత్సం

- నలుగురికి తీవ్ర గాయాలు

నగరం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన నగరంలో మద్యం మత్తులో విపరీతమైన స్పీడ్‌తో వచ్చిన ఓ ట్రాక్టర్ భీభత్సం సృష్టించింది. గ్రామస్తుల కథనం మేరకు స్థానిక మెయిన్ సెంటర్లో తీవ్ర మలుపు వున్నప్పటికీ అతివేగంగా ట్రాక్టర్ నడుపుతూ నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సెంటర్లో చిరువ్యాపారం చేసుకుంటున్న తాడివాక జయప్రదపై ట్రాక్టర్ ఎక్కడంతో కిందపడిన ఆమెపైగా ట్రాక్టర్ వెళ్ళటంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యంచేసి మెరుగైన వైద్యంకోసం మంగళగిరి మణిపాల్ వైద్యశాలకు తరలించారు. బజ్జీల బండిపైగా ట్రాక్టర్ దూసుకుపోగా వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యరక్షా కవచం



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్య రక్షా కవచమని అంగన్వాడి కార్యకర్త జడి లక్ష్మమ్మ వివరించారు. మండలంలోని అయినముక్కుల ఎస్సీ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు దోర్నాల సిడిపిఓ వి.కమల కుమారి పర్యవేక్షణలో సూపర్వైజర్ ఎన్.అంజమ్మ ఆధ్వర్యంలో మంగళవారం తల్లి పాల వారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులను ఉద్దేశించి అంగన్వాడి కార్యకర్త జడి లక్ష్మమ్మ మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలే మొదటి టీకా అని, ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండటంతో పాటు బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో విలువైన అన్నారు. తల్లిపాలు అనేవి కేవలం ఆహారం మాత్రమే కాదు. అది ప్రేమ, పరిరక్షణ, ఆరోగ్యం, భద్రత అన్నింటి సాంకేతమని తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు.



## శివరామపురంలో స్మశాన స్థలం పరిశీలన

తాళ్లూరు, మేజర్‌న్యూస్: శివరామపురం సర్వే నంబర్ 70/16లోని స్మశాన స్థలాన్ని తహసీల్దార్ ఎంవీ రమణా రావు పరిశీలించారు. స్మశాన స్థలంకు ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను కూల్చి వేసారని ఫిర్యాదు అందటంతో పరిశీలన నిమిత్తం ఆయన వెళ్లారు. ఆ ప్రాంతంలో గోడను కూల్చి రోడ్డు వేయటం వలన ఆ ప్రాంతంలో మరొక కులానికి చెందిన స్మశానికి దారి లేక పోవటంతో ఆ వైపు ప్రహరీ కూల్చి దారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేయర్ డానియేల్, విఆర్డీఓ చంద్రశేఖర్ రావు, నాయకులు నారా రామూర్మి, లక్ష్మి నారాయణలు పాల్గొన్నారు.

## 7న జూనియర్ బాలబాలికలకు షూటింగ్ బాల్స్ సెలక్షన్స్

టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలంలోని జమ్ముల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలిక లకు షూటింగ్ బాల్స్ సెలక్షన్ జరుగునని కార్యదర్శి కె.వెం కటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్‌లో పాల్గొనదలచిన వారు 19 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలని తెలిపారు. సెలక్షన్‌లో పాల్గొనదలచిన వారు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి అశోక్‌బాబుని సంప్రదించాలన్నారు.

## 12వ రోజు కామాక్షమ్మ వారి శ్రావణ మాస పూజలు





భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన భట్టిప్రోలు శ్రావణమాసం 12వ రోజు మంగళవారం వాసి శ్రీనివాసు- రుక్మిణి దంపతుల గృహంలో శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన నిర్వా హకురాలు అరుణకుమారి ఆధ్వ ర్యంలో కామాక్షి అమ్మవారి అర్చన మరియు పాదారవింద శతకము పారాయణ భట్టి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కామాక్షి అమ్మవారి దేవాలయంలో తొమ్మిది సార్లు 9 పళ్ళు తీసు కొని త్రికరణ శుద్ధిగా అమ్మ నామం జపం చేస్తూ ప్రదక్షణ చేస్తే తన భక్తుల యొక్క కోరి కలు నెరవేరుస్తుందని ఎందరో ఆ అమ్మ అను గ్రహాన్ని పొందారని మహనీయులు, మహా త్ములు తెలియజేశారు. కార్యక్రమంలో మద్దుల నలిని, టీ వాణి,దర్శి శశికళ,వై ప్రభా,కే నాగ మణి,శ్రీదేవి,లక్ష్మి, కే కుమారి,జి లక్ష్మి, నాగ నలిని,మోక్షిత, రాజ్యలక్ష్మి కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.



## పాత మీటర్లే కొనసాగించాలి

పామూరు, మేజర్‌న్యూస్: ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించొద్దంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. సీఐటియు మాజీ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ వైసిపి హయాంలోనే ఆదానితో ఒప్పందం కుదిరిందన్నారు. షాపుల్లో స్మార్ట్ మీటర్ల వలన అధిక బిల్లులు వస్తున్నాయని ఇళ్లకూ అమలైతే ప్రజలపై భారం పెరుగుతుందని హెచ్చరించారు. ట్రూ అప్, ట్రూ ఆఫ్ పేరిట రూ.17 వేల కోట్లు ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ ఏఈ జిలానికి అందజేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మాల్యాద్రి, ఐద్వా అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, ధనలక్ష్మి, గౌస్ బాషా, కాసిం, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com










# రాజకీయాలకతీతంగా అభివృద్ధి, సంక్షేమం

**మొదటి పేజీ తరువాయి** సైకిళ్లు పంపిణీ చేయడం లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. సైకిళ్లు పంపిణీ చేయడానికి అవసరమైన నిధులను Sembcorp Energy India Limited ప్రతినిధులు తమ సీఎస్ఆర్ నిధుల నుంచి వెచ్చించి ఇచ్చారని తెలిపారు. విద్యార్థులకు సైకిళ్లు అందజేయడంలో Sembcorp Energy India Limited వారు చూపిన చొరవను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అభినందించారు. పాఠశాలలో చదువుకునే 6 నుండి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థుల రాజకీయాలతో సంబంధం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన వాటినే సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం క్రింద ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 13 వేల రూపాయల వంతున తల్లుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం శుభ పరిణామమని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి మొత్తం 10 వేలు సైకిళ్లను అద్దంకి నియోజకవర్గంలోని విద్యార్థినీ, విద్యార్థులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. తల్లికి వందనం, గ్యాస్ పథకాలనూ అమలు చేస్తున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేదని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. కూటమి వచ్చిన వెంటనే సుమారు 1.10 లక్షల వితంతు పెన్షన్లను అర్హులకు అందించామన్నారు.

ముందుగా రూ.1.66 కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ ఆస్పత్రి నిర్మాణంతో పేదలకు వైద్యం మరింత అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం అంబేద్కర్ నగర్ లో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. జగజ్జీవన్‌రావు కాలనీలో రూ.31 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను కూడా మంత్రి ప్రారంభించారు.








అనంతరం కొరిశపాడులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికీ తెలుగుదేశంలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వేగవంతం చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని మంత్రి గొట్టిపాటి వివరించారు. కూటమి ప్రభుత్వంలో పథకాల అమలు జరుగుతున్న తీరును ప్రజలను అడిగి మంత్రి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొరిశపాడులో 15 మంది దివ్యాంగులకు మోటర్ ట్రై సైకిళ్లను మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా పంపిణీ చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఇప్పటికి 110 మంది దివ్యాంగులకు వాహనాలను ఉచితంగా అందించామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ., కొరిశపాడు ప్రజలు మరో 20, 30 ఏళ్లు వెనుతిరిగి చూడకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.50 లక్షలతో ఎస్సీ కాలనీలో రోడ్లు, సైడ్ డ్రైన్లు వేయడంతోపాటు గ్రామంలో 150 విద్యుత్ స్తంభాలను వేశామన్నారు. కొరిశపాడు గ్రామంలో డొంక రోడ్లను కూడా అభివృద్ధి చేశామని తెలిపారు. అన్నదాతలకు ఇబ్బంది లేకుండా పొలాలకు వెళ్లే రోడ్లను కూడా అభివృద్ధి చేసినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

## పాఠశాలలు, కళాశాలల్లో కృత్రిమ విద్య పెంపు చర్యలేవి: ఎంపి మాగుంట ప్రశ్న



ఒంగోలు, మేజర్‌న్యూస్ : పాఠశాలలు, కళాశాలల్లో కృత్రిమ విద్య పెంపుకు చర్యలేవని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దేశం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో పాఠశాల్లో కళాశాలలలో కృత్రిమ విద్య, యంత్ర అభ్యసనం, సాంకేతిక నూతన ఆవిష్కరణ, శిక్షణ కార్యక్రమాలు, కోర్సులు, మౌలికవసతుల కల్పన గురించి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో మాగుంట అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయక మంత్రి జయంత్ చౌదరి వివరణ ఇచ్చారు. 'జాతీయ విద్యా విధానం 2020' కృత్రిమ విద్య, యంత్ర అభ్యసనం, సాంకేతిక నూతన ఆవిష్కరణ ప్రాముఖ్యతను గుర్తించినదని, కృత్రిమ విద్య, డిజైన్ రూపకల్పన, సమగ్ర ఆరోగ్యం, సేంద్రీయ జీవనం, పర్యావరణ విద్య, ప్రపంచ పౌరసత్వ విద్య మొదలగు సమకాలీన విషయాల పరిచయం గురించి వివిధ ముఖ్య నైపుణ్యాలను విద్యార్థులలో పెంపుదల చేయబడునని తెలిపారు. దేశంలో 6 నుండి 9 తరగతులలో పూర్తి కృత్రిమ విద్య అందించే పాఠశాలలు 8,834 వుండగా, 10 నుండి 12 తరగతులలో ఆప్షనల్ సబ్జెక్టుగా అందించే పాఠశాలలు 10,005 వున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 వ తరగతిలో పూర్తి కృత్రిమ విద్య అందించే పాఠశాలలు 75 వుండగా, 12 తరగతిలో 7 పాఠశాలలు వున్నాయని మరియు ప్రకాశం జిల్లాలో 10 వ తరగతిలో 5 వుండగా, 12 తరగతిలో 1 పాఠశాల వున్నదని తెలిపారు. దేశంలో 2019 నుండి 10,000 మంది ఉపాధ్యాయులకు ఇంటెల్, ఐబియం నైలిట్ తదితర విద్యా సంస్థల నిపుణులచేత కృత్రిమ విద్యలో శిక్షణ ఇవ్వడం, అందరికి ఆన్ లైన్ సెమినార్లు నిర్వహించి కృత్రిమ విద్య గురించి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలో డెస్క్ టాపులు కలిగినవి 4,76,669, లాప్ టాపులు కలిగినవి 2,56,392, టాబ్లెట్స్ కలిగినవి 2, పాఠశాలలలో 75,857, స్మార్ట్ తరగతి గదులు కలిగినవి 3,59,459 మరియు ఇంటర్ నెట్ కలిగినవి 7,92,992 పాఠశాలలు ఉన్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## సంక్షేమ పథకాల అమలులో కూటమి చరిత్ర: ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, మేజర్‌న్యూస్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని చీరాల మండలం సాల్మన్ సెంటర్‌లో సుపరిపాలనలో–తొలి అడుగు కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ప్రజల సేవలో ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 200 సేవలు ప్రజలకు నేరుగా అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా నాలుగు గ్రూపులకు 19 లక్షల రూపాయల చెక్కులను, నూతనంగా 20 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 7 తారీఖు నుండి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామని మగ్గాలకు 200 యూనిట్లు మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని అన్నారు. గత వైసిపి పాలనలో సీఎం జగన్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశాడని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, వడగ రాజా, సిద్దిబుచ్చేశ్వరరావు, గొడుగుల గంగరాజు, ఎంపీడీవో, ఏఈ, ఏపిఎం మధు, అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



## పుష్ప @కరేడు

**మొదటి పేజీ తరువాయి** పోలీసులు దృష్టి సారించడంతో జాగ్రత్త పడి, ఎర్రచందనం తరలించే ప్రయత్నంలో తిరుపతి పోలీసులకు పట్టుపడ్డారు.

### దర్యాప్తు అధికారుల వద్ద కీలక సమాచారం

పట్టుబడిన అజిత్‌రెడ్డి కీలక అనుచరుని సమాచారంతో స్మగ్లింగ్ ర్యాకెట్ దందా బహిర్గతమైంది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ అక్రమ దందాలు కొనసాగడంతో పాటు భారీగా ఆస్తులను కూడబెట్టుకున్నట్లు అజిత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా నెల్లూరు లోని కమర్షియల్ ప్రాంతంలో వంద కోట్ల విలువైన బహుళ అంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్, నెల్లూరు, ఒంగోలు, విజయవాడలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, కరేడు గ్రామంలో కూడా దౌర్జన్యాలు, అక్రమాలు, గిరిజనుల భూములను లాక్కొని తన అధీనంలో ఉంచుకున్నారని ప్రజలు అంటున్నారు. రాజకీయాలకు ప్రశాంతంగా ఉండే కందుకూరు నియోజకవర్గంలో స్మగ్లింగ్ వంటి విష సంస్కృతి నాయకులు ముసుగులో చేయడంపై ఈ వ్యవహారం భవిష్యత్తు రాజకీయాలను ప్రభావితం చేయనుంది.

## 14 ఏళ్ళ నిరీక్షణకు తెర

**మొదటి పేజీ తరువాయి** ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒకటో వార్డు ముక్కు ప్రసాదు, 3వ వార్డు నేతి రవికుమార్, 4వ వార్డు నల్లమల శివకుమారి, 6వ వార్డు మునగల కృష్ణమ్మ, 7వ వార్డు మదిని వెంకటేశ్వర్లు, 8వ వార్డు దేపూరి రోజా, 9వ వార్డు కూనంనేని వాసంతి, 12వ వార్డు తన్నీరు సుబ్బులు, 14వ వార్డు చింతల సుజాత అదే విధంగా వైకాపా బలపరిచిన అభ్యర్థులు 2వ వార్డు కడియం నరసింహారావు, 5వ వార్డు బాలిశెట్టి సువార్తమ్మ, 10వ వార్డు పల్లె శివరావు, 11 వవార్డు కొమ్ము నాగలక్ష్మి, 13వ వార్డు మామిళ్ళపల్లి గోవిందమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### సర్పంచ్‌గా కొమ్ము సుశీల ప్రమాణ స్వీకారం

సర్పంచ్ ఏకగ్రీవంగా ఎన్నిక అయిన కొమ్ము సుశీల మంగళవారం పంచాయితీ కార్యాలయంలో ఎన్నికల అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో ప్రయాణ స్వీకారం చేశారు. అదే విధంగా ఏకగ్రీవంగా ఎన్నిక అయిన వార్డు మెంబర్లుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# ‘రండి టీ  తాగుతూ మాట్లాడుకుందాం’



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఎన్) ఆధ్వర్యంలో ‘రండి -టీ... తాగుతూ మాట్లాడుకుందాం’ అను కార్యక్రమమును తాలూకా అధ్యక్షులు వై.పి రంగయ్య అధ్యక్షతన గిద్దలూరు తాలూకా కార్యాలయంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిరంతరం పోరాటపట్టినతో ఉద్యోగుల భవిష్యత్తు కొరకు రాజీ లేని పోరాటం చేస్తూ ఉద్యోగుల హక్కులే లక్ష్యంగా ఉద్యోగులకు బకాయిగా ఉన్న 30 వేల కోట్ల రూపాయలు, పిఆర్‌సి, ఐఆర్, డిఎ, సరెండర్ లీవ్స్, ఇటువంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ వద్దకు తీసుకెళ్లే ముందు ఉద్యోగులను చైతన్య పరచాలన్న సదుద్దేశంతో మన రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ వీడియో ద్వారా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్2, 2019న గ్రామ వార్డు సచివాలయం వ్యవస్థ ఏర్పడిందని అప్పటి ప్రభుత్వం రెండు సంవత్సరములు ప్రొబిషన్ కాలంలో 15 వేల జీతం ఇచ్చినదన్నారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, ఏఓ అగ్రికల్చర్, ఉపాధ్యక్షులు అరిగెల వెంకటరామయ్య, ఎస్ నారాయణ ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్, భాస్కరరావు ఆర్ఐ గిద్దలూరు, రఫీ, ట్రెజరీ డిపార్ట్మెంట్, శశిధర్ గిద్దలూరు వార్డు అడ్మిన్, తాలూకాలోని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## తల్లిపాలను ప్రోత్సహించాలి

పామూరు, మేజర్‌న్యూస్: మండలంలోని రావిగుంట పల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవిఎస్ పార్వతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంట లోపే ముర్రుపాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలే తర్వాత అనుబంధ ఆహారంతో రెండేళ్ల వరకు ఇవ్వాలన్నారు. తల్లి పాలలోని పోషకాలు శిశువును రోగాల నుంచి కాపాడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, కార్యదర్శి బేబీ, కరిష్మా, ఆశ వర్కర్ కళావతి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



## తల్లిపాల వారోత్సవాలు

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలో గల బిసి కాలనీలో గల అంగన్వాడీ కేంద్రంలో మార్కాపురం ప్రాజెక్ట్, సిడిపిఓ పద్మావతి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు ఘనంగ నిర్వహించారు. ఈ సందర్బంగా సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని, శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతా యన్నారు. ప్రతి పల్లెలోనూ తల్లిపాల ప్రాముఖ్యతపై చర్చజ రగాలన్నారు. పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మి అంగన్వాడీ టీచర్స్ లలిత, నాసరమ్మ, సత్యనారాయణమ్మ, పద్మావతి, అచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు



కొల్లూరు, మేజర్‌న్యూస్ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పడితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కొల్లూరు,దోనేపూడి సెక్టార్ల సూపర్వైజర్లు రజని, ఫజరున్నీసాలు తెలిపారు. మంగళవారం పెసర్లంక, జువ్వలపాలెం అంగన్వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సమావేశంలో సూపర్వైజర్లు రజని, ఫజరున్నీసాలు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టడం వలన తల్లిపాల ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. తల్లిపాలు త్రాగే పిల్లలలో శారీరక, మానసిక వికాసం ఎక్కువగా ఉంటుందన్నారు. బిడ్డకు టీకాలు ఇప్పించినప్పుడు తల్లికి లేదా శిశువుకు జ్వరం వచ్చినప్పుడు కూడా తల్లిపాలు పట్టించవచ్చునన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లులకు రొమ్ము క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తుందన్నారు. తల్లి పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) బిడ్డకు అమృతం లాంటివన్నారు. ముందుగా ఆయా గ్రామాలలో అంగన్వాడీలు,వైద్య సిబ్బంది ఫ్లకార్డ్స్,బ్యానర్లు ప్రదర్శిస్తూ తల్లిపాలు ముద్దు-డబ్బా పాలు వద్దు అనే నినాదంతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కాశీ విశాలాక్షి, నిర్మలా జ్యోతి,నాంచారమ్మ,బాల త్రిపుర సుందరి,సుష్మ శ్రీ,ఆశా కార్యకర్తలు, గర్భవతులు తల్లులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ సదస్సు మంగళవారం స్థానిక నరవ రోడ్డు నందు ఆటో స్టాండ్ దగ్గర జరిగింది. ఈ సదస్సుకు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు జి.రాజు అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.అవులయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుండి ప్రారంభిస్తున్న స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పథకం కింద 15000 రూపాయలు ఇవ్వాలని, వివిధ రకాల పెంచిన టాక్సులు, ఇన్సురెన్సులు, ఆటోలకు చేస్తున్న బ్రేక్ ఫైన్లు తగ్గించాలని, డీజిల్ సబ్సిడీతో ప్రతి ఆటో కార్మికుడికి పది లీటర్ల వరకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, చదువుకొని ఉద్యోగం లేని నిరుద్యోగస్థులు ఆటో ప్రత్యామ్నాయ జీవన వృత్తిగా ఉందని ఈ రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. రవాణా రంగంపై అనేక గుర్తులు జీవనం గడుపుతు న్నాయని అన్నారు. ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల 12వ తేదీన గిద్దలూరు ఎమ్మార్వో కార్యాలయం దగ్గర ధర్నా జరుగుతుందని, ఈ ధర్నాలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ నాయ కులు పి బాల గురవయ్య, ఎస్కే రఫీ, ఎస్.రా జేష్, ఎస్.కె.ఉస్మాన్ పిలుపునివ్వడం జరిగింది. ఈ సదస్సులో ఆటో కార్మిక సంఘం నాయ కులు కే.హుస్సేన్, నరేంద్ర, రమేష్, ఏ.బాల పర్దిరాజు, ఎస్.కె. కరీం, రసూల్, దానం, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బి.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



## పల్లికోన, కోనేటిపురంలో ‘పొలం పిలుస్తోంది’

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పల్లెకోన,కోనేటిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.బ్రహ్మ రెడ్డి మాట్లాడుతూ వెద పద్ధతిలో నాటిన రైతులు,నాటుకున్న 25 రోజుల లోపు కలుపు మందు పిచికారీ చేసుకోవటం ద్వారా పైరులో కలుపు ఉధృతిని తగ్గించుకోవచ్చు నని తెలిపారు. జింకు ధాతు లోపాన్ని నివారించు కోవటానికి వారం రోజుల గడువులో 2 సార్లు,2గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఇఓలు కారంకి.లక్ష్మీ ప్రసన్న, వి.బుష్, టి.అఖిల,వి.ఎఎలు రత్నరాజు,యుగంధర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.




## ఇలవర, కట్టవారిపాలెం గ్రామాలలో....

కొండపి, మేజర్‌న్యూస్: మండలం పరిధిలోని ఇలవర, కట్టవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించడం  జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి యం.మాల్యాద్రి అధ్యక్షత వహించారు ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025కి క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకొనే రైతులకు ఈ నెల 14వ తేదీ వరకు అవకాశం ఉంది అని రైతులు అందరు కూడా  దగ్గరలో ఉన్న మీసేవా కేంద్రాలకు వెళ్ళి కట్టు కోవాల్సిందిగా తెలియపరిచారు. అన్నదాత సుఖీభవ డబ్బులు అర్హత ఉండి పడనివారికి ప్రభుత్వం  కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పి.కుమార్, విఏఏ శ్రీకాంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది  జ్యోత్స్న, గ్రామ రైతులు పాల్గొన్నారు.




## పంటల బీమాకు ప్రభుత్వం గడువు పెంపు

పామూరు, మేజర్‌న్యూస్: భూములను కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు  తమ గ్రామాల్లోని వీఆర్వోను సంప్రదించి కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి అబ్రహం లింకన్ తెలిపారు. మండలంలోని వగ్గంపల్లి, రావిగుంటపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయానికి చెందిన విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మనీషా, సరస్వతి, సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు. రైతులు పంటల సాగు, భీమా వివరాలు, సాంకేతిక సహాయం అంశాలపై అధికారులను సంప్రదించారు.

## ఉద్యాన రైతులకు అరటి సాగులో సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఆత్మ వారి ఆధ్వర్యంలో ఉద్యాన రైతులకు అరటి సాగులో సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన అసోసియేట్ డీన్ ఉద్యాన కళాశాల, చినలత్రపీ, కందుకూరు సివి విజయ భాస్కర్  మాట్లాడుతూ సిగతోక ఆకు మచ్చ తెగులు గురించి వివరించారు. అరటిలో ముఖ్యంగా సిగటోకా ఆకు మచ్చ తెగులు ఎక్కువగా విస్తరిస్తోంది అన్నారు. ఉద్యాన శాఖ అధికారి శ్వేత మాట్లాడుతూ రైతులకు తగు సలహాలు, సూచనలు తెలిపారు.

## వరిలో జింక్ లోప నివారణకు చర్యలు చేపట్టాలి



వేమూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్:  వరి వైరులో జింకులోప నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ప్రేమ్సాగర్ తెలియజేశారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం చావలి గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ లో వరి మొక్క 20 రోజులు  ఉందన్నారు. కొన్నిచోట్ల అకాల వర్షాల కారణంగా నీరు అధికంగా నిలబడిన ప్రాంతాలలో వరి మొక్కలపై తుప్పు మచ్చలు ఏర్పడ్డాయని అలా ఉన్నట్టయితే అది జింక్ లోపం ఉన్నట్లు భావించాలన్నారు. జింకులోప నివారణకు రైతులు ఒక లీటర్ నీటిలో రెండు గ్రాములు జింక్ కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా పంట బలహీనంగా ఉన్నట్లయితే ఫార్ములా 4 ఎకరాకు ఒక కేజీ చొప్పున పిచికారి చేయాలని రైతులకు సూచించారు, కార్యక్రమంలో ఏఈవోలు,రైతులు పాల్గొన్నారు.




## అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ఫిర్యాదు చేసికోవచ్చు

నగరం, మేజర్‌న్యూస్: అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకాలకు అర్హులైన రైతులకు నగదు జమకానిపక్షంలో రైతు సేవా కేంద్రంలో భూమికి సంబంధించిన పత్రాలతో దరఖాస్తు చేసికోవాలని మండల వ్యవసాయాధికారి వి. రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పూడివాడ గ్రామంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ రమేష్‌బాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పోర్టల్లో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసికోవచ్చున్నారు. ఖరీఫ్ వరి పంట సాగుచేసే రైతులు పిఎంఎఫ్‌బివై పథకం క్రింద ఒక ఎకరానికి రూ.800లు వరి పంటల భీమా క్రింద ప్రీమియం ఆగస్టు 15వ తేదీలోపు చెల్లించాలన్నారు. అనంతరం క్షేత్ర సందర్శనలో భాగంగా వరి నారుమళ్ళు, పచ్చిరొట్ట పైర్లను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె. నాగశ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె. భూదేవి, రైతులు పాల్గొన్నారు.



## వాహనాలు తనిఖీ చేసిన ఎస్ఐ శివకుమార్

పిట్టలవానిపాలెం మేజర్‌న్యూస్: వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి ప్రయాణాలు చేయాలని ఎస్సై శివకుమార్ అన్నారు. మండలంలోని చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద ఎస్సై ఎస్ శివకుమార్ మంగళవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన పత్రాలను తనిఖీ చేసి, వాహన పత్రాలు సరిగా లేని వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



## అదానీ స్మార్టు మీటర్లు బిగించవద్దు

దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం అదానీ స్మార్టు మీటర్లుని రద్దు చేయాలని మంగళవారంప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో దరిశి ఈఈ ఆఫీసు వద్ద నిరసన తెలిపి అధికారి షేక్ మహాబూబ్ భాషా డిమాండ్స్‌తో వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు మాట్లాడుతూ కేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అదానీ కంపెనీతో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఒప్పందం చేసుకుందని ఇప్పుడు పని చేస్తున్న మీటర్లుని తొలగించి అదానీ స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలోని గృహాలకు బిగించుతున్నారని సింగిల్ ఫేస్ మీటర్ కి 9 వేల రూపాయలు, త్రీ ఫేస్ మీటర్‌కి 17 వేల రూపాయలు రాబోవు 93 నెలల పాటు నెల, నెల బిల్లుతో పాటు అధనంగా డబ్బులు వసూలు చేస్తారని, మన గృహవినియోగ దారులు వాడుకున్న విద్యుత్‌కి ఉదయం ఒక ధర, మధ్యాహ్నం ఒక ధర, రాత్రి ఒక ధర వసూలు చేస్తారని అన్నారు. రైతు సంఘం దరిశి కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంపై తెలుగుదేశం నాయకులు జగన్, అదానీ కుమక్కై 1250 కోట్లు అవినీతి విద్యుత్ ఒప్పదంలో జరిగిందని, స్మార్టు మీటర్లు ప్రజలకు నష్టం అని వాటిని బిగిస్తే పగల గొట్టాలని, హైకో ర్టులో కేసులు వేసి ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గం అని, జగన్ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు కొనసాగించడంతో ఇద్దరూ ఒక్కటే అని, ఓట్లు కోసమే ప్రజలను మభ్య పెట్టడం చేస్తున్నారని విమర్శించారు., సిపియం, సిఐటియు, రైతు, డివైఎఫ్ఐ, నాయకులు కె.వి.పిచ్చయ్య, గోగు వెంకయ్య, కోమరగిరి కోటేశ్వరరావు, యం.యలమందారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వసతిగృహాలు

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: నిజాంపట్నం, మేజర్ న్యూస్: నిజాంపట్నం మండలంలోని బిసి వెనుకబడిన తరగతుల వసతి గృహాలు ఆరు ఉన్నాయి. అందులో ఐదు బాలుర, ఒకటి బాలికల వసతి గృహాలు ఉండగా నిజాంపట్నంలోని ఒకటి బాలుర మరొకటి బాలికల వసతి గృహాలు ఉన్నా యి. మిగిలినవి మండలంలోని శింఖపాలెం, అడవు లదీవి, నక్షత్ర నగర్, కొత్తపాలెంలో ఉన్న నాలుగు బాలుర వసతి గృహాలు అద్దె భవనంలో కొనసాగిం చారు. ఇదిఇలాఉండగా ఈ వసతి గృహాలన్నీ విద్యార్థులు లేక ఏళ్ల తరబడి మూతపడి ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన ప్పటికీ మూతపడిన విద్యార్థుల వసతి గృహాలను మరల ప్రారంభం అవుతాయని ప్రజలు ఆశలతో ఉండగా






వాటిని పట్టించుకునే నాయకుడే కరువ య్యారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమం లో నిజాంపట్నంలో ఉన్న బాలుర, బాలికల, రెండు వసతి గృహాలు ప్రభుత్వ పక్క భవనాలు ఆ భవనా లలో రాత్రి వేళలో అసాంఘిక కార్యకలాపలకు అడ్డాగా మారాయని ఆ ప్రాంతవాసులు తెలుపుతు న్నారు. జిల్లా అధికారులు మరియు స్థానిక నాయ కులు స్పందించి మూతపడిన వసతి గృహాలను తిరిగి ప్రారంభించడమా లేక ఈ రెండు ప్రభుత్వ భవనాలను ప్రభుత్వ అవసరాల కొరకు వేరే కార్యాల యాలుగా మార్చి ఉప యోగించుకోటమా చేస్తే ఉపయోగంగా ఉంటుందని ఈ ప్రాంత వాసులు తెలుపుతున్నారు.

## అర్హులు అందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపు

అద్దంకి మేజర్‌న్యూస్: అర్హులు అందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఎర్రైయ్యా తెలిపారు. ధర్మవరం శంఖవరప్పాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఆధార్ తప్పుగా నమోదు అయిన వారికి తహసీల్దార్ కార్యాలయం లో సరి చేసుకున్నట్లయితే వారికి కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుంద న్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు మ్యుటేషన్ చేసి వారి వారసులకు ,జాయింట్ ల్యాండ్ పార్సిల్ లు విడదీసి దానిలో ఉన్న రైతులుకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న లో కత్తెర పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల ఉద్యాన అధికారిణి దీప్తి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు సూచనలు చేశారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయ కులు శేషయ్య, ఖాజాబీ, తదితరులు పాల్గొన్నారు.





## పేకాట రాయుళ్లు అరెస్టు

నిజాంపట్నం, మేజర్‌న్యూస్: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాట రాయులను పట్టుకున్న సంఘటన మంగళవారం మండలంలోని ప్రజ్ఞం గ్రామంలో చోటు చేసుకుంది. అడవులదీవి ఎస్సై బత్తుల బాబురావు తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞం గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేయగా పొలాలలో పంపుచెట్టు దగ్గర పేకాట ఆడుతున్న 9మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నున్న 3170 రూపాయలు నగదును స్వాధీనం పలుచుకు న్నట్లు ఎస్సై తెలియజేశారు.

## వెలుగు గ్రామైఖ్య సంఘ ప్రతినిధుల సమావేశం



సి.యస్.పురం, మేజర్‌న్యూస్: మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో మండలంలోని గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు సమీక్ష సమావేశం శిక్షణా కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఎపియం లక్ష్మీనారాయణ మాటాడుతూ స్వయం సహాయక సంఘాల మొబైల్ బుకింగ్ నందు 2024 మార్చి నెలాఖరువరకు చివరితేదీగా లావాదేవీలు నమోదు చేయాలని తరువాత ఈసంవత్సరం ఆగస్టునెల వరకు నమోదుచేయాలని సెప్టెంబర్ నెల నుండి లైవ్ మీటింగ్ యాప్‌లో నమోదు చేయాలని అన్నారు.అదేవిధంగా స్త్రీనిధి ఉన్నతికి మొండిబకాయిలు ఉన్న సంఘాలు బకాయిలు చెల్లించేలా చూడాలని విఓఏలకు సూచించారు. ఈ సందర్భంగా షేడ్ నెట్ వేసుకునే వారిని,చేపల పెంకపకం, అరకు కాఫీ, మునగపంటపై ఆసక్తివున్న లబ్దిదారులను గుర్తించి నమోదు చేయాలని ఎపియం సూచించారు. అనంతరం హైగ్రో కంపెనీ అందించిన కూరగాయల విత్తనాలు 881 గ్రూపులకు అందజేసి పెరటి తోటలో సాగుచేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యపరమైన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపియం లక్ష్మీనారాయణ, వెలుగు సీసీలు నారాయణమ్మ, మస్తాన్ రెడ్డి, కాశయ్య, గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సూక్ష్మ లోపాలను సరిచేయాలి

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మొక్కజొన్నలో సూక్ష్మ లోపాలను సరిచెయ్యాలని మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. మండలంలోని మల్కాపురం, శివరామపురం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. పోషక లోపాలు ఒక్కొక్క సారి తెగులు మచ్చల వలే కనిపిస్తాయని తెలిపారు. పలు క్షేత్రాలను పరిశీలించి నివారణ చర్యలను సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివిఏ వెంకట రాజా రైతులు పాల్గొన్నారు.

## తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ: సిడిపిఓ

దర్శి, మేజర్‌న్యూస్: తల్లిపాలల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తమ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని దర్శి ఐసిడిఎస్ సిడిపిఓ పరిమళ కోరారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం దర్శి పురపాలక సంఘం పాత క్రిస్టియన్ కాలనీ అంగన్వాడీ కేంద్రం 2లో జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టుసిడిపిఓ పరిమళ మాట్లాడుతూ ప్రతి బిడ్డకి తల్లిపాలు కచ్చితంగా అందించాలని, గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలని, ఆరు నెలల దాకా కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని పరిమళ కోరారు. రెండు సంవత్సరాలు వయసు వచ్చే వరకుతల్లిపాలు బిడ్డలకుఇవ్వాలని, తల్లిపాలు విశిష్టతను గురించి సిడిపిఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్‌లు అనురాధ, సిహెచ్ సుభాషిని, దర్శి పురపాలక సంఘం అంగన్వాడీ కార్యకర్తలు పాత క్రిస్టియన్ కాలనీ ఏరియా తల్లులు పాల్గొన్నారు.





## అక్రిడేషన్లను పొడిగించవద్దని
## కొల్లూరు జర్నలిస్టు యూనియన్ వినతి

కొల్లూరు, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఆదేశాల మేరకు కొల్లూరు జర్నలిస్టు లు ఆధ్వర్యంలో వెంటనే అక్రిడేషన్లను జారీ చేయాలని జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇప్పటికైనా ప్రభుత్వం అక్రిడేషన్లను పొడిగించకోకుండా ఇవ్వాలని మంగళవారం కొల్లూరు జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ బి వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు.

# స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ కనిగిరిలో సిపిఐ ధర్నా

కనిగిరి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో వినియోగదారులపై అదనపు భారం మోపేలా ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల అమలుకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, కనిగిరి విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి జిపి రామారావు ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ గతంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి అని పిలుపునిచ్చినప్పటికీ నేడు అదే మీటర్లను ఇంటింటికీ అమలు చేయడం ప్రజలను మోసం చేసినట్లేనని విమర్శించారు. అదానీ కంపెనీతో కలిసి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్లకు పైగా వినియోగదారులకు పాత మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లను బలవంతంగా అమలు చేస్తోందని



మండిపడ్డారు. ఒక సింగిల్ ఫేస్ మీటర్ ఖర్చు రూ.9,000, త్రీ ఫేస్ మీటర్ అయితే మరింత ఎక్కువ. దీనిని 93 నెలల వాయిదా పద్ధతిలో ప్రజల నుంచి వసూలు చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఇది విద్యుత్ పంపిణీ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే కుట్రలో భాగమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పూర్తిగా రద్దయ్యే వరకూ, ట్రూ-అఫ్ చార్జీలు నిలిపే వరకూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాన్ని కొనసాగిస్తాం అని రామారావు స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ అధికారి పవన్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గులాం హుస్సేన్, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి పందిటి మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మాచవల్లి పూర్ణచంద్ర రాజు, ఏఐటియుసి నాయకులు ఖాసింపీరా, బషీర, కోటయ్య, అంకమ్మ, శీను, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి తాహీద్ తదితరులు పాల్గొన్నారు.



## సమాచార హక్కు చట్టంపై అవగాహన

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలోని మరపగుంట్ల సచివాలయంలో సమాచార హక్కు చట్టం మీద గ్రామ సభ నిర్వహించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ ఒంగోలు శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీలు ధనుంజయ్, గిరి, డీలర్ చెన్నకేశవ రెడ్డి, వార్డ్ నెంబర్ మితికెల బాలయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలో గిరిజన, బడుగు బలహీన వర్గ ప్రాంతాలుగా ఉన్న సర్వోదయ కాలనీ, మంకిన వారి పాలెంలో గల మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలలోని విద్యార్థులకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో పలకలు, నోట్ బుక్స్ పంపిణీ మంగళవారం చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, మండలంలో వెనకబడిన ప్రాంతాలలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలను ఎన్నుకొని ,ఆ పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులకు, విద్యాభివృద్ధి కోసం నోట్ పుస్తకములు పంపిణీ చేయుట జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన సలహాదారులు మరియు రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీమతి నాగమాంబ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి పట్టభద్రుల సంఘం కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సజ్జా ఓం ప్రకాష్, కోట సువర్ణలత, చుండూరి ఆదిశేషమ్మ మండల ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీమతి పింజల విజయ కుమారి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలోనూ సంతోషంగా ప్రజలు

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: వైసిపి ప్రభుత్వం అధికారంలో జగనన్న పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చీరాల నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జ్ కరణం వెంకటేష్ బాబు అన్నారు. బాబు షూరిటీ - మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చీరాల మండలం ఓడరేవు పంచాయతీలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీరాల నియోజకవర్గ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అనే పథకాలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలుపొంది అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఓడరేవుకు 482 కోట్లతో హార్బర్ ను మంజూరు చేసి వాడరేవు గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని ఆయన అన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని



ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, చీరాల మండల పార్టీ అధ్యక్షులు అద్దంకి రెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాల రెడ్డి, అక్కల శ్రీనివాస్ రెడ్డి, మచ్చ సువార్త, పిక్కి కాశీ రావు, కావూరి రమణారెడ్డి, బిట్రా శ్రీనివాసరావు, పృథ్వి ధనుంజయ్, బోడ పిల్లి తాతారావు, సిరిపిల్లి శీను బాబు, ఎర్రి పిల్లి రాము, దబ్బకూటి జగన్ మోహన్ రావు, గుద్దంటి సుధాకర్, దేవరపల్లి కుమార్ బాబు, కొమ్మనబో యిన గవాస్కర్, తెళ్ల పెద్ద రాంబాబు, ప్రవీణ్, చీరాల మండలం వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఓడరేవు గ్రామ నాయకులు, నాయకులు కార్యకర్తలు మరియు వాడరేవు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## 14లోపు పంటల భీమా చేయించుకోవాలి

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: గ్రామాల్లో రైతులు సాగు చేసుకున్న పంటలకు పంటల భీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు కోరారు. మండలంలోని జమ్మలమడక మారెళ్ళ గ్రామాల లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమల రావు మాట్లాడుతూ రైతులందరూ వేసిన ప్రతి పంటకు పంట భీమా నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు బాల వెంకటయ్య, రాధామణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యోగేశ్వరమ్మ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: దేశవ్యాప్తంగా ఈ నెల 12న జరిగే నీళ్ల పురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మారెళ్ళ వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ కోరారు. మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే మంగళవారం జరిగింది. డాక్టర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా ఆగస్టు 12న జరిగే దేశవ్యాప్త నులి పురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి పాఠశాలలో ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, ఇళ్ల వద్ద 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ కూడా ను నులిపురుగు నివారణ మాత్రలను ఆల్బెండజోల్‌ని ఖచ్చితంగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి డి.వెంకట్రావు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కెవి రాజు, హెల్త్ సూపర్వైజర్ కే అంజమ్మ, ఆయుష్మాన్ భారత్ క్లినిక్ సిహెచ్వోలు ఆశాలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



## ఫసల్ భీమాయోజన పథకంపై అవగాహన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఖరీఫ్ సీజన్ పంటలకు సంభందించి వేసిన పంటలకు ఈపంట నమోదు చేయించుకుని ప్రధానమంత్రి ఫసల్ భీమాయోజన పథకం కింద భీమారుసుం చెల్లించి నమోదు చేసుకోవాలని మం డల వ్యవసాయ అధికారి పి.మధుబాబు అన్నారు. మంగళ వారం మండలంలో రేగులచెలక, అంబవరం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భ ంగా ఆయా గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించిన వ్యవసా య అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజనుకు జిల్లాలో కంది, వరి,సజ్జ,మిర్చి, సువ్వులు, పత్తి పంటలను అధికారులు ఎం పిక చేసినట్లు రైతులు భీమాచెల్లించి నమో దు చేసుకోవాలని సూచించారు. పియం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే భూములకు ఆధార్ అను సంధానం చేసుకో వాలని రైతులకు సూచించారు. కార్య క్రమంలో ఏఓ మధు బాబు, ఏఇఓ పి.శ్రీనివాసులు, వ్యవసా య సహాయకులు వి.చిరంజీవి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## క్విస్‌లో డ్రోన్ టెక్నాలజీపై ఇంటర్న్ షిప్




ఒంగోలు, మేజర్‌న్యూస్: క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీపై ఇంటర్న్ షిప్‌ని మంగళవారం ప్రారంభించారు. మేఘాలయా షిల్లాంగ్ లోని నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ రీచ్ (నెక్టార్), క్విస్ ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్తంగా ఈ ఇంటర్న్ షిప్ నిర్వహి స్తున్నా రు. నెల రోజుల పాటు విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ అందించనున్నారు. డ్రోన్ పనితీరు, డ్రోన్ ఎలా అసెంబుల్ చేయాలి తది తర అంశాలను ఈ ఇంటర్న్ షిప్‌లో నేర్పించనున్నట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమా నూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి తెలి యజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెక్టార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరుణ్ కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ డ్రోన్ టెక్నాలజీ రోజు రోజుకి అభివృద్ధి చెందుతుందని, ఈ ఇంటర్న్ షిప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడు తుందని చెప్పారు. రానున్న రోజుల్లో డిఫెన్స్, డీఆర్ డీవో తదితర సంస్థల్లో డ్రోన్ అవసరం ఎక్కువగా ఉంటుందని అన్నారు. అనంతరం మాట్లాడిన సూర్య కల్యాణ్ చక్రవర్తి క్విస్ ప్రపంచ అవసరాలను దృష్టిలో ఉంచుకుని క్విస్ కళాశాలలో బోధన జరుగు తుందని దాంట్లో భాగంగానే డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రెండు నెలల కిందటే నెక్టార్ తో ఎంవోయూ జరిగిందని, వెంటనే ఇంటర్న్ షిప్ ఆచరణలోకి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీగాయత్రి డ్రోన్ టెక్నా లజీపై జరుగుతున్న ఈ ఇంటర్న్ షిప్ ప్రతి ఒక్క విద్యార్థి సద్వినియోగ పరచుకోవాలని సూచిం చారు. కార్యక్రంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.హనుమంత రావు, డీఎవ్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, డీఎవ్ ఆర్ డీన్ డాక్టర్ భార్గవ్, డీన్‌లు, డైరెక్టర్లు, హెచ్‌వోడీలు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని ఆ విధంగా తీసుకున్నట్లయితే ప్రసవం తర్వాత తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత అన్నారు. మండలంలోని పసుపుగల్లు గ్రామంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సునీత మాట్లాడుతూ బిడ్డలకు మొదటి టీకా ముర్రుపాలేనని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.




## చాకిచర్ల, పెద్దపట్టపు పాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని చాకిచర్ల, పెద్దపట్టపు పాలెం గ్రా మాల్లోని రైతు సేవ కేంద్రాల్లో వ్యవసాయాధికారి డి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులందరికీ ఖరీఫ్‌లో పంటల యాజమాన్య పద్ధతు లపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులందరికీ ఆగస్టు 2వ తారీకున పిఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు, అన్నదాత సుఖీభవ 5 వేల రూపాయలు తమ ఖాతాల్లో జమ చేయటం జరిగిందని ఎవరికైనా డబ్బులు జమ కాకపోతే మీ గ్రామంలోని రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించాలని చెప్పారు. పలు కారణాల వల్ల డబ్బులు పడని రైతులకు గ్రీవెన్స్ పెట్టుకునే అవకాశాన్ని కల్పించారని రైతులందరూ తమ గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులతో కలిసి గ్రీవెన్స్ అప్లై చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ తమ పంటలను ఖరీఫ్ సీజన్‌లో ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్ర సిబ్బంది షారుక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## చిలుకూరుపాడులో 'పొలం పిలుస్తుంది'

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: వ్యవసాయ శాఖ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం చిలుకూరుపాడు గ్రామంలో నిర్వహించినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ.కాశీ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ప్రకాశం పథకం మీద అవగాహన, ఎంపీసీఎల్ బ్యాంకు ఇన్, ఆధార్ మ్యాచ్, రైతుల రికార్డ్స్ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ పనిముట్లు కావలసిన రైతులు పిఎస్కే అసిస్టెంట్ యాప్ నందు సర్వే నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, పశుపోషక సిబ్బంది పాల్గొనడం జరిగిందని ఏవో కాశీ విశ్వనాథ తెలిపారు.



## ఎన్.ఎన్.కండ్రికలో తల్లిపాల వారోత్సవాలు

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: కామేపల్లి సెక్టార్ పరిధిలోని వర్జినేని వారి పాలెం గ్రామ సచివాలయంలోని ఎన్ ఎన్ కండ్రిగ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు మంగళవారం సెక్టార్ సూపర్వైజర్ ఎల్.విజయ ఆధ్వర్యంలో చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు అన్నారు పాలు బిడ్డకు శ్రేష్టకరమని పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి ముర్రు పాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి బిడ్డకు పెరుగుతుందని తల్లులకు అవగాహన కల్పించారు. తల్లులతో అపోహలతో కొందరు మాతృమూర్తులు పాలు ఇవ్వడంలో విమర్శలు ఉన్నాయని అటువంటి అపోహాలు మానుకోవాలన్నారు బిడ్డకు ఏ విధంగా పాలు పట్టాలో తల్లుల కూడా ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సిహెచ్ శ్రావణి, డి.భాగ్యలక్ష్మి, బిఆర్ సులోచన పాల్గొన్నారు.

# అట్టహాసంగా బిషప్ కె.సంతోష్ ప్రసన్న పట్టాభిషేకం





కొమరోలు, మేజర్‌న్యూస్: నంద్యాల డయాసిస్ బిషపుగా రైట్ రెవరెండ్ కే.సంతోష్ ప్రసన్న రావ్ పట్టాభిషేక కార్యక్రమం మంగళవారం సిఎస్ఐ (ఎస్‌పిజి) కేథడ్రల్, సెంటినరీ చర్చిలలో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్ మోస్ట్ రైట్ రెవరెండ్ రూబేన్ మార్క్ అధ్యక్షతన అట్టహాసంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మోడరేటర్ పట్టాభిషేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి త్రివేండ్రం, డోర్నకల్, కర్ణాటక, మెడ్రాస్ ఆయా ప్రాంతాల నుండి వచ్చిన సుమారు 9 మంది బిషప్పులచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నంద్యాల డయాసిస్కు సంబంధించిన సన్నాఫ్ ది సాయిల్ గా ఆరవ బిషప్ గా పట్టాభి శక్తునిగా చేయడం జరిగింది. అనంతరం మోడరేటర్ తండ్రి మోస్ట్ రైట్ రెవరెండ్ రూబేన్ మార్క్ మాట్లాడుతూ నంద్యాల డయాసిస్ పీఠాధిపతిగా నమ్మకముగా, యధార్థముగా, నిష్పక్షపాతంగా, నిష్కాపట్యంతో, నిస్వార్థముతో, మిషనరీల సేవను సద్వినియోగపరచుటకు, అధ్యక్ష మండల క్షేమమును, అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళుతూ, నంద్యాల డయాసిస్ మంద ప్రధాన కాపరిగా మార్గదర్శిగా ఉత్తమ సేవలు అందించి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా ప్రవర్తించాలని ఆ విధమైన దేవుని కృప సోదరునిగా శిష్యునిగా స్నేహితునిగా కుటుంబ సభ్యునిగా బిషప్ సంతోష్ ప్రసన్నారావుకు అనుగ్రహించాలని ఆశీర్వదించడం జరిగింది. అనంతరం బిషప్‌గా పట్టాభి శక్తుడైన బిషప్ సంతోష్ ప్రసన్న రావుకు పవిత్రమైన బైబిల్ గ్రంధాన్ని మందను కాపాడే దండాన్ని ఆశీర్వదించబడిన సిలువను ఉంగరమును చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా కాన్స్టిట్యూషన్ను, బిషప్‌గా ఎన్నికైన సర్టిఫికెట్ను సిఎస్ఐ సినాడ్ ఆఫీస్ బేరర్ల ఆధ్వర్యంలో మోటరేటర్ అందజేశారు.

## 20 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభలు




కొండపి, మేజర్‌న్యూస్: దేశంలో ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి కోసం సిపిఐ పార్టీ పోరాటం సాగిస్తుందని జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యుడు కె.వీరారెడ్డి తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 28వ రాష్ట్ర మహాసభలు సందర్భంగా కొండపిలో మంగళవారం సిపిఐ పార్టీ నాయకులతో కలిసి కళాబృందం బృందం ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు బస్టాండు నుండి ప్రదర్శనగా సాగి అద్దంకి బస్టాండు కొత్త మార్కెట్ మైదానం వరకు సాగి బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభల్లో ఆర్థిక రాజకీయ సామాజిక అంశాలపై, పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, దేశ సమైక్యత సమగ్రత కోసం విభజన హామీల అమలు కోసం మహాసభలు వేదిక కానున్నట్లు తెలిపారు. సిపిఐ కార్యకర్తలతో పాటు కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్‌తో పాటు కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలని కోరుతూ ధర్నా



నాగులుప్పలపాడు, మేజర్ న్యూస్: ప్రజలపై భారాలు మోపే ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దుచేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని ఉప్పుగుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి టి శ్రీకాంత్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వలన ప్రజలపై అదనపు భారాలు పడతాయన్నారు. ఈపాటికే ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై చార్జీల భారం మోపుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఆదానీ కంపెనీతో చేసుకున్న సెకీ ఒప్పందంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి 1750 కోట్లు ముడుపులు తీసుకున్నారని తద్వార స్మార్ట్ మీటర్లు బిగింపుకు శ్రీకారం చుట్టారన్నారు ఈనేపద్యంలో ఆ స్మార్ట్ మీటర్లు పగలు గొట్టాలని జగన్ మోహన్ రెడ్డి పై చర్యలు తీసుకుంటామని ఎన్నికల్లో చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. అఈ కార్యక్రమంలో యు.వెంకటేశ్వర్లు, అంకమ్మ, రావెళ్ళ వెంకట్రావు, జి.బసవపున్నయ్య, కొమరగిరి రామాంజనేయులు,ఎన్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## గుండా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి



బాపట్ల మేజర్ న్యూస్: బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి లోక్ సభ జాయింట్ సెక్రటరీ గుండా శ్రీనివాసులు సోమవారం అనారోగ్యం కారణంగా మృతి చెందారని బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు విన్నకోట సత్య ప్రసాద్, కార్యదర్శి కొలగాని వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఎన్క్లేవ్ గ్రీన్ పార్క్ స్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నవని భార్య మైథిలి, కుమార్తె జయని చరవాణి ద్వారా సమాచారం అందించారని తెలిపారు. శ్రీనివాసులు మిత్రులు శ్రేయోభిలాషులు చివరి చూపు చూడదలచిన వారు హాజరు అవ్వాలని కోరారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ పూర్వ విద్యార్థుల సంఘం శ్రద్ధాంజలి తెలిపారు.



## స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై సిపిఎం నిరసన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపియం నాయకులు ఊసావెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు మండలంలోని అరివేముల, సి.ఎస్.పురం, ఉప్పలపాడు సచివాలయంల వద్ద నిరసన తెలియజేసి స్థానిక సచివాలయం సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపియం నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై ఆర్థిక పెనుభారం పడుతుందని ఇంధన సర్దుబాటు చార్జీలు ట్రూఅప్ చార్జీల పేరుతో ఇప్పటికే ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ మీటర్లను పెడితే ప్రజలు మరింత ఇబ్బందులు పడతారని ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకుని పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిపాలన అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, యస్.తిరుపతిరెడ్డి, గుర్రం లక్ష్మయ్య, రత్నారెడ్డి, నరసారెడ్డి, యేసురత్నం, పలువురు స్థానిక సిపియం శ్రేణులు పాల్గొన్నారు.

## ఆశాడేలో పాల్గొన్న వైద్య ఆరోగ్య విభాగ కౌన్సిలర్లు

బాపట్ల, మేజర్‌న్యూస్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ లోని భాగమైన బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవి /ఎయిడ్స్ (దిశా) ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా లోని ఐసీటీసీ/పీపీటీసీటీ/డీసీఆర్సీ కౌన్సిలర్స్ ప్రతినెలా జిల్లా లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొదటి మంగళవారం జరిగే ఆశా డే లో జిల్లా లోని ఐసీటీసీ /పీపీటీసీటీ/డిఎస్ఆర్సి సెంటర్స్ కి సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో /పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగిన ఆశా డే కార్యక్రమానికి ఐసీటీసీ /పీపీటీసీటీ/డిఎస్ఆర్ కౌన్సిలర్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి పరీక్ష ప్రాముఖ్యత, వ్యాధి వచ్చే మార్గాలు, వచ్చిన తర్వాత అందించే చికిత్స విధానం గురించి సుఖవ్యాధుల గురించి, హెచ్ఐవి తల్లి నుంచి బిడ్డకు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఏపీ సాక్స్ చేస్తున్నటువంటి వివిధ రకాల కార్యక్రమాల గురించి ఎఎన్ ఎం, ఆశా వర్కర్స్ అందరికి కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని/పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు, ఆసుపత్రి ఎఎన్ ఎం లు, ఆశా వర్కర్స్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సిఎస్‌పురంలోని ఎస్టీ ప్రాథమిక పాఠశాలలో పనిచేయుచున్న పలువురు ఉపాధ్యాయులు ఇటీవల బదిలీకాగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యల్.ఆంథోనీ ఆధ్వర్యంలో ఘనసన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నుండి బదిలీ అయిన యస్.వెంకట రామిరెడ్డి, పోట్టేండ్ల మాలకొండయ్య, పి.యం.రఫీలను ఎంఇఓలు జె.ప్రసాద రావు, ఆర్.కొండారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పియంసి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ విధులపట్ల అంకితభావంతో పనిచేసినపుడు సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అదేవిధంగా సహచర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచి విద్యాభివృద్ధికి కృషిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు అంతేకాకుండా పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు విద్యాబోధన చేయడంలో బదిలీ అయిన ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని తెలిపి ప్రత్యేక అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు, ఎంఇఓలు ప్రసాదరావు, సిఎస్.పురం, అరివేముల హైస్కూలు ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదరున్నీసా బేగం,ఒంగోలు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్, తోట శ్రీనివాసులు, కె.రామసుబ్బారావు, సిహెచ్.సునీత దేవి, షేక్ షకీలాబేగం, డి.పున్నమ్మ, పి.అరుణ, జి.రామకృష్ణ, షేక్ అహ్మద్, సిహెచ్ చంద్రశేఖర్, బత్తుల రవీంద్ర, ఇంద్రప్రసాద్, వహీద్, ఎలికా శ్రీనివాసులు, సుబ్బారాయుడు, పియంసి ప్రతినిధి సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం పొడగింపు




పొదిలి, మేజర్‌న్యూస్: 2025క్రాప్ ఇన్సూరెన్సు తుది గడువును 31 జూలై 2025 నుండి 14 ఆగష్టు 2025 వరకు గడువు పొడిగించడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లవరం, అక్కచెరువు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ 2025లో వేసినటువంటి పంటలను తప్పని సరిగా నమోదు చేయించు కోవాలని కోరారు.పంట ఇన్సూరెన్స్ చేయించుకునే రైతులు వ్యసాయ సహాయకులని సంప్రదించి భూమి వివరాలు ఆన్లైన్ సాగు ధ్రువీకరణ పత్రం లో నమోదు చేయించుకొని ఆ తరువాత రైతు వాటాగా కందికి పంటకి ఎకరాకి రూ.430,సజ్జ రూ.156, వరి పంటకు రూ. 860,మిరప పంటకు రూ.4500 చెల్లించి కామన్ సర్వీస్ సెంటర్స్ నందు నమోదు చేయించు కోవాలన్నారు. కౌలుకి సాగు చేసుకునే ప్రతి రైతు కూడా తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం కార్డ్స్ తీసుకోవాలని తెలిపారు. ఈ పంట సాగు హక్కు పత్రాలను గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి పొందాలని సూచించారు. కౌలు కార్డు, ఈ పంట నమోదు చేయించుకోవడం వల్ల అతివృష్టి అనావృష్టి సమయం లలో పంట నష్టపరిహారం ఇన్సూరెన్, అదేవిధంగా పం పండించిన పంటలను మద్దతు ధరకి అమ్ముకోవడానికి, సబ్సిడీ ద్వారా విత్తనాలు పొందడానికి ఈ పంట సాగు హక్కు పత్రాలుపత్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ధనలక్ష్మి ఉద్యాన శాఖ హెచ్ఈఓ ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు గురుబ్రహ్మం , ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఎస్ఐ



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పాఠశాల చైర్మన్లకు ఎస్ఐ కమలాకర్ సూచించారు. మండలంలోని ఎస్ఎంసి చైర్మన్‌తో స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఎస్సై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని ఎస్సై కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కలగజేయాలని ఆయన కోరారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు తమ ఫోన్‌లకు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా సందేశాలు పంపించిన అటువంటివి ఓపెన్ చేయొద్దని ఎస్సై కోరారు. అపరిచిత వ్యక్తుల నుండి మీకు లాటరీ గెలిచారు మీకు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు పడాలన్న తల్లికి వందనం డబ్బులు పడాలన్న మీ ఫోన్ కి ఓటిపి నంబర్ వస్తుందని ఆ నంబరు తమకు తెలియజేయాలని అడుగుతారని వారికి ఓటిపి నంబర్లు చెబితే మీ ఖాతాలోని నగలు మొత్తం వారి అకౌంట్‌కు ట్రాన్స్ఫర్ చేసుకుంటారని ఇటువంటి వాటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై కమలాకర్ కోరారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలో హనుమంతరావు పవన్ కుమార్ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.




# స్మార్ట్ మీటర్లు వద్దు బాబోయ్

## ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దు

### కంకణాల ఆంజనేయులు

కొత్తపట్నం, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల మీద భారాలు మోపటం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఈతముక్కల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలి, విద్యుత్ భారాలు ప్రజల మీద మోపద్దని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి ఎస్ స్వామి రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందుగా రాష్ట్రంలోని కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచేదే లేదని వీలైతే తగ్గిస్తామని చెప్పారని అన్నారు. సిఐటియు మండల కార్యదర్శి సూర్ని స్వామి రెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పట్టపు ప్రకాశం, పిల్లి కృష్ణ, వి. యానాది, టి. రామిరెడ్డి టి. లక్ష్మమ్మ, కట్ల కుమారి, కే. కోటేశ్వరరావు, కే. బ్రహ్మయ్య, బత్తుల బాలకోటయ్య పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం




మార్టూరు, మేజర్‌న్యూస్: గ్రామంలో శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల నందు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ట్రాఫిక్ లైట్ దినోత్సవం సందర్భంగా కాలేజీ పిల్లలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్టూరు సిఐ మద్దినేని శేషగిరిరావు భవిష్యత్ తరాలకు మంచి పౌరులుగా ఎదగాలని బాగా చదువుకొని సమాజానికి మీరు ఎంతగానో ఉపయోగపడాలన్నారు. రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.ద్విచక్ర వాహనాంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అతిథిగా శ్రీ షేక్ సైదా ఎస్సై, శ్రీ హర్షిని కాలేజ్ ప్రిన్సిపాల్ గద్దం ఆంజనేయులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరావు సీనియర్ రొటేరియన్ కోయిలమూడి హనుమంతరావు, మాజీ అధ్యక్షులు జాస్తి సాంబశివరావు, షేక్ ఖాజా హుస్సేన్, రొటేరియన్స్ పెంట్యాల లక్ష్మీనారాయణ, చల్లగుండ్ల శ్రీనివాసరావు, కాలేజీ పిల్లలు, కాలేజ్ బస్సు డ్రైవర్లు సుమారు 200 మందికి పైగా పాల్గొని విజయవంతం చేశారు. తదనంతరం పిల్లలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి



చీరాల రూరల్, మేజర్‌న్యూస్: మండలంలోని బోయినవారిపాలెం, తోటవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి బాపట్ల సహా వ్యవసాయ సంచాలకులు రమాదేవి హాజరై రైతులకు అవగాహన కల్పించారు. అధికారి రమాదేవి మాట్లాడుతూ వేరుశనగలో సూక్ష్మ పోషకాల లోపాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని నివారించడానికి ఫార్ములా 4 ఒక గ్రాము లీటర్ నీటి కలిపి చేయాలని సూచించారు. రైతులు ఎప్పటి కప్పుడు అధినిక వ్యవసాయ పద్ధతులపై మెలుకువలు తెలుసుకొని అధిగ దిగుబడులు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో చీరాల సహాయ వ్యవసాయ సంచాలకులు టి.రత్నకుమారి మాట్లాడుతూ వరిలో పచ్చిరొట్ట ఎరువులు వాడటం ద్వారా 25శాతం రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.నిర్మలాదేవి, విఏఏలు కుమారి జ్యోతి, నీలిమలు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి, దేశాయిపేట రైతు సేవా కేంద్రాల్లో 'పొలం పిలుస్తుంది'



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని పందిళ్ళపల్లి, దేశాయిపేట-2 రైతు సేవా కేంద్రాల పరిదిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.సరిత అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఎకౌంట్లో డబ్బులు పడ్డాయి రూ.5వేలు, పీఎం కిసాన్ రూ.2వేలు పడ్డాయని తెలియజేశారు. కౌలు రైతులు కౌలు రైతు కార్డు చేయించుకోవాలని లోన్ కూడా ఇస్తున్నారు కావున రైతులందరూ పంట నమోదు ఖచ్చితంగా చేయించుకోవాలని, వరి పంట నందు కలుపు నివారణపై అవగాహన కల్పించారు. అలాగే రైతులకి ఎరువులు కూడా కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం గ్రామ వ్యవసాయ సహాయకులు సౌజన్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కదిరి బాబురావు విద్యాసంస్థల ఉచిత వసతిగృహం




సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లాపరిషత్ ప్లస్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న సుమారు 80మందికి పైగా విద్యార్థిని విద్యార్థులకు కదిరి బాబురావు విద్యాసంస్థల అధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ఉచిత భోజనం, వసతిగృహం ఏర్పాటు చేయడంపట్ల ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్మీడియట్ ఉన్నత విద్యను అభ్యసించడానికి అందుబాటులో జూనియర్ కళాశాల ఏర్పాటుచేసి ఉచితంగా నాణ్యమైన భోజనం అదేవిధంగా వసతులు కల్పించి తమకు ఉన్నతవిద్య అభ్యసించడానికి సహకారం అందిస్తున్న వ్యవసాయ, ఉద్యాన కళాశాల వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే కదిరిబాబురావుకు విద్యాసంస్థల యజమాన్యానికి ప్రత్యేకకృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఇంటర్ విద్యార్థులు ఆనందంతో తెలిపారు.



## ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### 'రండి టి తాగుతూ మాట్లాడుకుందాం'లో కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ ఆదేశాలతో ఒంగోలు రాంనగర్ 5వ లైన్ల ఫుడ్ సేఫ్టీ ఆఫీసులో కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రధానంగా చర్చించిన విషయాలు మనకు ప్రభుత్వం నుండి రావల్సిన నాలుగు డిఏలు, పిఆర్‌సి కమిటీని వేయుట మధ్యంతర భృతి, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వివిధ వర్గాల నుండి సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కార దిశగా ప్రయత్నం చేయుట గురించి చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వరకుమార్ ఉపాధ్యక్షులు రామణ వెంకటేశ్వర రెడ్డి, గోపికృష్ణ, కోశాధికారి రంగారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, కోశాధికారి ఏసురత్నం, శ్రీనివాసరావు, సునీల్, జవహరాలి, తాలూకా అధ్యక్షులు సురేష్ బాబు, కార్యదర్శి శ్రీదేవి, చంద్రశేఖర్, శ్రీనివాసులు,మహిళాఅధ్యక్షురాలు డాక్టర్ మానస, వనజ,సుమతి, గౌరీ, పాల్గొన్నారు.

## మిట్టపాలెంలో తల్లిపాల వారోత్సవాలు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: పుట్టినశిశువులకు తల్లిపాలుతో సంపూర్ణఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపరవైజర్ దేవకృపావరం అన్నారు.మంగళవారం మండలంలోని కోవిలంపాడు పంచాయతీ మిట్టపాలెం అంగన్వాడీ కేంద్రం నందు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా సూపరవైజర్ మాట్లాడుతూ పుట్టినబిడ్డకు తల్లిముర్రుపాలు అందించడం వలన మంచి ఆరోగ్యవంతంగా ఉండి శక్తివంతంగా ఉంటున్నట్లు తల్లులు తప్పనిసరిగా పిల్లలకు మురిపాలు ఇవ్వాలని అదేవిధంగా మంచిపోషక పదార్ధాలు కలిగిన కూరగాయలు, గుడ్లు, చిరుధాన్యాలు ఆకుకూరలు తీసుకోవడం వలన ముర్రుపాలు శక్తివంతంగా ఉండి పిల్లలకు పోషకశక్తిని ఇస్తున్నట్లు తల్లులకు సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.

## కొండేపి సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించేటట్టు చేయడం దుర్మార్గం

### - ఇన్చార్జి శ్రీపతి సతీష్ ఆవేదన



కొండేపి, మేజర్‌న్యూస్ : కొండేపి పంచాయతీ ఎన్నికలకు ఈ రోజు నామినేషన్ ఉపసంహరణ ఆఖరి తేదీ రోజున కాంగ్రెస్ అభ్యర్థి వై సురేఖ అధికార బలంతో బెదిరింపు దోరణలతో నామినేషన ఉపసంహరించేటట్టు చేయడం దుర్మార్గం అని కొండేపి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీపతి సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఎవరు శత్రుఓ ఎవరు మిత్రుడో అర్థం కావడం లేదని తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా అభ్యర్థిని పెట్టాం కానీ ఎవరికీ డబ్బు ఖర్చు కాకుండా ఎన్నికలు జరగకుండా అధికార పార్టీ అభ్యర్థి యునానిమస్ కావడం ఎవరికి అర్థం కావటం లేదని బలమైన ప్రతిపక్షం అని చెప్పుకునే వైసిపి కూడా దీనికి సమాధానం చెప్పాలని శ్రీపతి సతీష్ ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థికి వెన్నుదన్నుగా ఉండటంలో పిసిసి అధ్యక్షురాలు వైస్ షర్మిల రెడ్డి కి రాష్ట్ర పిసిసి ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం కి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్కే సైదా కి కొండేపి మండల అధ్యక్షులకు కొండేపి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు సతీష్ కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని రోజులు ఒకలా ఉండవు అని రాబోవు రోజుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారని కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఎదగటం లో తమ వంతు కృషి చేస్తామని సతీష్ తెలియజేశారు.

## శ్రీ సీతారామాలయ ధర్మకర్తగా రామసుబ్బారావు ప్రమాణం




చిన్నగంజాం, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా చిన్నగంజాం గ్రామంలో భావనారాయణ స్వామి కోవెలలో జరిగిన కార్యక్రమంలో నూతనముగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాలయ ధర్మకర్త (సింగల్ ట్రస్ట్)గా బాపట్ల జిల్లా టీడీపీ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు.ఇ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు పోద వీరయ్య చౌదరి,బాపట్ల జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు కోంద్రగుంట శ్రీహరి సమక్షంలో ప్రకాశం జిల్లా దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఇఓ శ్రీనివాసరావు మోటుమర్రి రామసుబ్బారావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రామ సుబ్బారావు మాట్లాడుతూ తనకు ఇంతటి బృహత్తర బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే ఏలూరి సంబశివరావుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రామసుబ్బారావును మండల పలువురు ప్రముఖులు శాలువాతో ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వలివేటి రామనుజం, తుమ్మలపేంట జయరావు, సందు శ్రీనివాసరావు, పల్లప్రోలు లక్ష్మీ నారాయణ, అజాద్, నభిషా, వడ్లముడి సత్యనారాయణ, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకోండ సురేష్, సతిష్, కె.శివరామకృష్ణ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్త విలేకరుల కోర్కెల దినం



త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: మండల విలేకరులు జర్నలిస్టుల రాష్ట్ర వ్యాప్త కోర్కెల దినం కార్యక్రమం నిర్వహించారు. త్రిపురాంతకం మండల తాహాసీల్దార్ వెంకటేశ్వర్లుకు మంగళవారం స్థానిక విలేకరులు పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీయు డబ్ల్యూజె రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు.పాత అక్రెడిటేషన్ల గడువును ఇక ముందు పొడిగించకుండా, రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రెడిటేషన్లు వెంటనే ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి, అక్రెడిటేషన్ కమిటీలలో జర్నలిస్టుల యూనియన్స్ కు ప్రాతినిధ్యం కల్పించాలి. వర్కింగ్ జర్నలిస్టుకు హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా ఉపయోగపడేలా, స్కీం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ఒక నిర్దిష్టమైన పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేసారు. వర్కింగు జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలి. ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలిని,విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలి.ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం విలేకరులు శేషు, పిచయ్య, వెంకటేశ్వర్లు, హనుమంతరావు,వెంకట రెడ్డి,అంజిరెడ్డి, వివేక్ పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



పెద్దారవీడు, మేజర్‌న్యూస్: మండలంలోని పెద్దారవీడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం (జనరల్) నందు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూపర్వైజర్లు ఏ.అంజమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలన్నారు. ప్రతి తల్లి ఆకుకూరలు గుడ్డు పాలు వంటి పౌష్టికాహారాలు తీసుకొని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండేటట్లు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు దుర్గారాణిబీ సావిత్రిబీ వీరనారాయణమ్మ, బీ.నాగమ్మ, తల్లులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే లిబరేషన్ పార్టీ లక్ష్యం

### బహిరంగసభలో పార్టీ వ్యవస్థాపకులు విజయకుమార్ పిలుపు




కొత్తపట్నం, మేజర్‌న్యూస్ : వైసిపి, టిడిపి, బిజెపి లాంటి పెత్తందారుల పార్టీలను వదిలి పేదలు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీలో చేరాలని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కొత్తపట్నంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చిరుతోటి శోభన్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ మాట్లాడుతూ రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీలో చూడబోతున్నారు అన్నారు. 75 సంవత్సరాల పాలన సాగించిన ప్రభుత్వాలు ఏ విధంగా విఫలమయ్యారు మనం ప్రత్యక్షంగా తీశామన్నారు. వైసీపీ హయాంలో రెండున్నర లక్ష కోట్లతో బట్టన్ నొక్కే విధానం ద్వారా పేదలకు డబ్బులు పంపిణీ చేసే తప్ప సమగ్ర అభివృద్ధి చూపించలేకపోయారన్నారు. ఇక టిడిపి మూడు లక్షల కోట్లతో హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నారన్నారు. ఆధిపత్యం వారికి ఓటు వేసి మనపై పెత్తనం చేసేలా మనం చేస్తున్నమే తప్ప మన జాతి కోసం ప్రయత్నం చేయడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుల నుండి నగర కార్పొరేషన్ మేయర్ వరకు పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజనలో బిజెపి టిడిపి టిడిపిలో ప్రత్యేక హొదా ఇవ్వాలని కాంగ్రెస్పై శిక్ష ప్రచారాలు చేసి దుష్ప్రచారాలు చేసి అధికారం చేపట్టగానే వాటిని తుంగలో తొక్కారన్నారు. రాజధాని నిర్మాణానికి 1000 కోట్లు ఇచ్చి ఆపివేయడం జరిగిందన్నారు. విశాఖ రైల్వే జోన్ రామాయపట్నం పోర్ట్ నెల్లూరు పోర్ట్‌లను ఆపివేశారన్నారు. 2014 ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారిగా ఉండి కేవలం గంటన్నరలోపు ఒంగోలు అసెంబ్లీ పార్లమెంట్ నియోజకవర్గ ఫలితాలను ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పాదయాత్ర సుమారు 2257 కిలోమీటర్లు చేసి ప్రజాదర్బాల్లో వేలమంది హాజరై అనేక సమస్యలు తీర్చామన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీ మహిళా కన్వీనర్ ఐశ్వర్య, జిల్లాకన్వీనర్ కేశవ్, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో 'సారధ్యం' పర్యటన విజయవంతం చేయాలి



మార్కాపురం, మేజర్‌న్యూస్. ఈ నెల 7న ప్రకాశం జిల్లాలో జరగనున్న "సారధ్యం" రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలనీ బీజేపీ రాష్ట్ర నాయకులు డా. ఏలూరి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పీవీఎన్ మాధవ్ మొదటిసారిగా జిల్లాకు వస్తున్న ఈ సందర్భంగా, ఆయన పర్యటనను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని డా. ఏలూరి తెలిపారు. సారధ్యం పర్యటనలో భాగంగా ఒంగోలులో భారీ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో బీజేపీ కార్యకర్తలు, హిందూ బంధువులు విశేషంగా పాల్గొనాలని కోరారు. అనంతరం నిర్వహించనున్న కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ప్రతీ కార్యకర్త పాల్గొని, బీజేపీ అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో బీజేపీపార్టీ రాష్ట్రంలో మరింత బలంగా ఎదుగుతోందని. ఆయన మార్గదర్శకత్వంలో ఉత్సాహంగా పనిచేస్తూ, పార్టీని పటిష్టంగా తీర్చిదిద్దుతాం అని డా. ఏలూరి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాగా ప్రకాశం జిల్లాలో బీజేపీ ప్రాతినిధ్యం పెంచేందుకు ఈ పర్యటన కీలకంగా మారనుంది. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ, పార్టీ బలోపేతానికి శ్రీకారం చుట్టే ఈ పర్యటనపై బీజేపీ వర్గాల్లో విశేష ఆశలు నెలకొన్నాయి.

## బీసీ హాస్టల్‌ను తరలించవద్దని విద్యార్థుల ఆందోళన

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని బీసి 2 బాలుర వసతి గృహాన్ని వేరే చోటకు తరలించవద్దని విద్యార్థులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. కనిగిరి పట్టణంలోని బీసి 2 బాలుర వసతి గృహాన్ని వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువు గ్రామానికి మారుస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం బిసి హాస్టల్ నందు 80 మంది విద్యార్థులు 6 నుండి 10వ తరగతి వరకు చదువు కుంటున్నారు. డివిజన్ కేంద్రంలో ఉన్న హాస్టల్‌ను గ్రామీణ ప్రాంతానికి తరలించడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. బిసి 2 బాలుర వసతి గృహాన్ని కనిగిరి పట్టణంలోనే కొనసాగించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.